
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 14 నవంబరు 2024



సమాజ సేవలో వైజాగ్ బీట్స్

- ప్రేక్షకులను ఓలలాడిస్తున్న గాయకులు
- వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా విశాఖ వేదికగా కార్యక్రమాలు
- పాటల కచేరీ ఆదాయంతో సమాజ సేవ



- 8లో

ఉద్యానవనంగా డంపింగ్ యార్డు

కాపులుప్పాడలో దశాబ్దాలుగా పేరుకుపోయిన 24 లక్షల టన్నుల చెత్తను తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశం

- యార్డులోని చెత్త పునర్వినియోగానికి జీవీఎంసీ కమిషనర్ కార్యాచరణ
- ఇప్పటికే ఉన్న రీసైక్లింగ్ యూనిట్ల సామర్థ్యాన్ని పెంచాలని నిర్వాహకులకు ఆదేశాలు
- కొత్తగా మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ యూనిట్ ఏర్పాటు
- ఇప్పటివరకూ 9.5 లక్షల టన్నుల చెత్త తవ్వి తీసి పునర్వినియోగం
- ఖాళీ అయిన 33 ఎకరాల్లో మొక్కలు నాటాలని నిర్ణయం
- వచ్చే అక్టోబరు రెండో తేదీ నాటికి యార్డులో చెత్త లేకుండా చేయాలని లక్ష్యం



కాపులుప్పాడలోని డంపింగ్ యార్డు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కాపులుప్పాడ డంపింగ్ యార్డును చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ కార్యాచరణ రూపొందించారు. యార్డులో ఏళ్ల తరబడి పేరుకుపోయిన 24 లక్షల టన్నుల చెత్త కారణంగా పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది అక్టోబరు రెండో తేదీ నాటికి యార్డులో చెత్త లేకుండా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.



కాపులుప్పాడ డంపింగ్ యార్డులో బయోమైనింగ్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

జీవీఎంసీ పరిధిలో ప్రతిరోజూ 1,100 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. అందులో 350 టన్నులు తడి చెత్త కాగా మిగిలింది ప్లాస్టిక్, గాజు, కాగితం, డెబ్రిస్ వంటి పొడి చెత్త. నగరంలో ఉత్పత్తి అయ్యే చెత్తనంతటినీ కాపులుప్పాడలోని డంపింగ్ యార్డుకు తరలిస్తారు. ఏళ్ల తరబడి ఇదే పద్ధతి కొనసాగుతుండడంతో సుమారు వంద ఎకరాల్లో విస్తరించి ఉన్న డంపింగ్ యార్డులో 24 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త కొన్ని అడుగులు ఎత్తున కొండలా పేరుకుపోయింది. యార్డులో చెత్తను తగులబెడుతుండడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు కాలుష్యం వెదజల్లేది. అంతేకాకుండా వర్షం పడినప్పుడు ఆ నీరు చెత్త ద్వారా భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో చెత్తను శాస్త్రీయ విధానంలో నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే

... మిగతా 6వ పేజీలో

కాపులుప్పాడ డంపింగ్ యార్డు విస్తీర్ణం	వంద ఎకరాలు
యార్డులో పోగైవున్న చెత్త	24 లక్షల టన్నులు
ఇప్పటివరకూ పునర్వినియోగానికి తరలించిన చెత్త	9.5 లక్షల టన్నులు
చెత్త ఖాళీ అవడంతో అందుబాటులోకి వచ్చి భూమి	33 ఎకరాలు
ఇంకా యార్డులో మిగిలి ఉన్న చెత్త	14.5 టన్నులు

మెట్రో ప్రాజెక్టుపై వాడీ వేడిగా..

ప్రతిపాదిత కారిడార్లు

స్టీల్ ప్లాంటు-కొమ్మాది	34.4. కి.మీ.
గురుద్వారా-పాత పోస్టాఫీసు	5.07 కి.మీ.
తాటిచెట్లపాలెం-చినవాల్తేరు	6.75 కి.మీ.
కొమ్మాది-భోగాపురం విమానాశ్రయం	30.67 కి.మీ.

ఎలా నిర్మించబోతున్నారని అసెంబ్లీలో ఎమ్మెల్యే వెలగపూడి ప్రశ్న

- వైసీపీ ప్రభుత్వ హయాంలో రూపొందించిన పాత ప్రతిపాదనలు ఇచ్చారని అసంతృప్తి
- ఏ మోడల్‌లో నిర్మిస్తారో తెలియజేయాలని కోరిన ఎమ్మెల్యే గణబాబు
- ఫ్లైఓవర్లు అవసరమన్న పల్లా శ్రీనివాసరావు
- రెండు దశల్లో నాలుగు కారిడార్లు నిర్మిస్తామన్న మంత్రి నారాయణ
- కేంద్రం నుంచి అనుమతి రాగానే ముందుకు వెళతామని వెల్లడి



వెలగపూడి రామకృష్ణబాబు

పల్లా శ్రీనివాసరావు

గణబాబు

నారాయణ

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుపై అసెంబ్లీలో కూటమి నాయకుల మధ్యే బుధవారం వాడివేడి చర్చ జరిగింది. విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టు ఏ దశలో ఉంది?, ఎలా నిర్మించబోతున్నారంటూ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు ప్రశ్న వేశారు. దానికి పురపాలక శాఖ ఇచ్చిన సమాచారం చూసి ఆయన అసంతృప్తి వ్యక్తంచేశారు. వైసీపీ ప్రభుత్వం తయారుచేసిన నివేదికలు ఇచ్చారని, ఈ నెల మూడో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో సమీక్షం నిర్వహించి, మెట్రో రైలు ప్రాజెక్టును డబుల్ డెక్కర్ మోడల్‌లో నిర్మించాలని అధికారులకు సూచించారని, ఆ విషయాలు ఏవీ తనకు ఇచ్చిన సమాధానంలో లేవని ఆరోపించారు. సీఎం చేసిన సూచనలు కూడా ప్రతిపాదనల్లో చేర్చలేదా?, కేంద్రానికి ఏ ప్రతిపాదనలు పంపారో మంత్రి నారాయణ వెల్లడించాలని డిమాండ్ చేశారు. విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, రాష్ట్ర పునర్విభజన చట్టంలోనే విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజెక్టును నిర్మించాలనే ప్రతిపాదన ఉందని, దాని ప్రకారమే గతంలో సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో దీనికి డీపీఆర్ రూపొందించారని గుర్తుచేశారు. టెండర్లు పిలిచి ఖరారు చేసే సమయంలో ఎన్నికలు రావడంతో అది అక్కడితో ఆగిపోయిందన్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మెట్రో కారిడార్‌ను పక్కన పెట్టిందన్నారు. ఇప్పుడు ఈ ప్రాజెక్టును పాత విధానం ప్రకారం 40 శాతం కేంద్రం ఇచ్చే వయబులిటీ గ్యాప్ ఫండింగ్‌తో చేస్తారా?, లేదంటే కోల్‌కతా మోడల్‌లా పూర్తిగా 100 శాతం కేంద్రం సాయంతో నిర్మిస్తారా?...చెప్పాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే అక్కడకు నగరం నుంచి జాతీయ రహదారిపై వెళ్లడానికి చాలా సమయం పడుతుందని, ఫ్లైఓవర్ల నిర్మాణం అవసరం ఉందని, వాటిని ఈ ప్రాజెక్టులో కలిపి

... మిగతా 6వ పేజీలో

కూటమి నేతలకు పదవులు

- గవర, కొప్పుల వెలమ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌లలో సభ్యులుగా ఉమ్మడి జిల్లాకు చెందిన 18 మందికి అవకాశం

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ప్రభుత్వం రజక, గవర, కొప్పుల వెలమ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్లకు బుధవారం సభ్యులను నియమించింది. అందులో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన 18మంది కూటమి నాయకులకు అవకాశం లభించింది. టీడీపీ, జనసేన, బీజేపీ వర్గాలు ఈ నియామకాలపై హర్షం వ్యక్తంచేస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో గవర సామాజిక వర్గం అధికం. దాంతో గవర కార్పొరేషన్‌లో ఈ ప్రాంతానికి చెందిన వారికే ప్రాధాన్యం లభించింది. గవర కార్పొరేషన్ సభ్యులుగా తెలుగుదేశం పార్టీకి చెందిన పెంటకోట అజయ్‌బాబు (విశాఖ పశ్చిమ నియోజకవర్గం), అల్లా మంగరాజు (నర్సీపట్నం), భీమరశెట్టి శ్రీనివాసరావు (ఎలమంచిలి), బొడ్డేడ నాగ గంగాధర్ (చోడవరం), పొలమరశెట్టి శ్రీనివాసరావు (విశాఖ నార్త్), రవికుమార్ మళ్ల (విశాఖ ఈస్ట్), బొడ్డేడ శ్రీనివాస్ (అనకాపల్లి), వేగి పరమేశ్వరరావు (పెందుర్తి), జనసేన నుంచి విల్లూరి హరికృష్ణ (అనకాపల్లి), బీశెట్టి గోపీకృష్ణ (విశాఖ), బీజేపీ నుంచి విశాఖకు చెందిన బుద్ధా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. కొప్పల వెలమ కార్పొరేషన్ సభ్యులుగా టీడీపీ నుంచి లాలం కాశీనాయుడు (పాయకరావుపేట నియోజకవర్గం), చల్లారపు రామ్మోహన్ (విశాఖ వెస్ట్), రొంగలి మహేశ్ (మాడుగుల), జనసేన నుంచి రాజాన సూర్యచంద్ర (నర్సీపట్నం), బీజేపీ నుంచి ఈర్లె శ్రీరామమూర్తి (చోడవరం)ని నియమించారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ సభ్యులుగా టీడీపీకి చెందిన పి.అప్పలరమేశ్ (నర్సీపట్నం), కేవీఎస్ నరేశ్ (విశాఖ నార్త్)ను సభ్యులుగా నియమించారు.

వీఎంఆర్‌డీఏ కొత్త లేఅవుట్లు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏర్పాట్లు

- నాలుగు ప్రాంతాల్లోని 46 ఎకరాల్లో 538 ప్లాట్లు
- ఏడాదిలోగా ప్లాట్లను వేలానికి సిద్ధం చేయాలని నిర్ణయం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) కొత్త లేఅవుట్ల ఏర్పాటుపై దృష్టిసారించింది. వైసీపీ ప్రభుత్వంలో ఎంఐజీ టౌన్‌షిప్‌లు వేసినా పెద్దగా స్పందన రాలేదు. ఆనందపురం మండలం పాలవలస మినహా మిగిలినచోట్ల లేఅవుట్లలో ప్లాట్ల కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో సంస్థకు ఉన్న భూముల్లో లేఅవుట్లు వేయాలని నిర్ణయించింది. మొత్తం 46 ఎకరాల్లో 538 ప్లాట్లు వచ్చేలా ప్లానింగ్ విభాగం ప్రణాళికలు రూపొందించింది.

- భీమిలి మండలం కాపులుప్పాడలో 20.48 ఎకరాల్లో 209 ప్లాట్లు వేసేందుకు ప్లాన్ సిద్ధం చేసింది. ఆ భూమిని అభివృద్ధి చేయడానికి రూ.14.51 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసింది. వాటిని విక్రయిస్తే రూ.86 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా.
- భీమిలి మండలం నిడిగట్టులో 8.15 ఎకరాలలో 103 ప్లాట్లు వేయడానికి రూ.519 కోట్లు ఖర్చుతో ప్రణాళిక వేశారు. వీటి అమ్మకం ద్వారా రూ.23 కోట్లు వసుందని భావిస్తున్నారు.
- పెందుర్తి మండలం చినముషిడివాడలో 4.7 ఎకరాలలో 84 ప్లాట్లు వేయడానికి రూ.3.1 కోట్లు ఖర్చు అవుతుందని, వాటి విక్రయం ద్వారా రూ.40 కోట్లు వస్తుందని అంచనా వేశారు.
- అనకాపల్లి మండలం తుమ్మపాలలో 12.68 ఎకరాలలో 142 ప్లాట్లు వేయడానికి రూ.5 కోట్లు ఖర్చు అవుతుందని, వాటి విక్రయం ద్వారా రూ.35 కోట్లు వస్తుందని అంచనా.

ఈ ప్రాజెక్టులను ఏడాది సమయంలోగా అభివృద్ధి చేసి ప్లాట్లను వేలానికి సిద్ధం చేయాలని అధికారులు ఆలోచిస్తున్నారు. లేఅవుట్ల అభివృద్ధిలో భాగంగా బీటీ రహదారులు, విద్యుద్దీకరణ, పార్కుల నిర్మాణం, 60 అడుగుల రహదారులకు డివైడర్లు, సీసీ కాలువలు, కల్వర్టులు, ఎవెన్యూ ప్లాంటేషన్ చేయనున్నారు. ఈ ప్రతిపాదలన్నీ పురపాలక శాఖ ఆమోదం కోసం అమరావతి పంపించారు. ఆమోదం లభిస్తే టెండర్లు పిలిచి లేఅవుట్లు అభివృద్ధి చేస్తారు. ఆ తరువాత ప్లాట్లను వేలం ద్వారా విక్రయిస్తారు.

స్పెషల్ బ్రాంచి ఏడీసీపీగా శ్రీనివాసరావు

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనరేట్‌లో స్పెషల్ బ్రాంచి ఏడీసీపీగా బి.శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. 2016 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన బి.శ్రీనివాసరావు కొన్నాళ్ల కిందటివరకూ విశాఖ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఏడీసీపీగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సెబ్‌ను రద్దు చేయడంతో ఆయన్ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేయడంతో పోస్టింగ్ కోసం వెయింటింగ్‌లో ఉన్నారు. నగర స్పెషల్‌బ్రాంచి ఏడీసీపీ పోస్టు రెండు నెలలుగా ఖాళీగా ఉండడంతో ఆ పోస్టులో శ్రీనివాసరావును నియమించారు.

మహా మేత

మలేరియా విభాగంలో తాత్కాలిక కార్మికులు:	406
ప్రజారోగ్య విభాగంలో తాత్కాలిక కార్మికులు:	790
ఒక్కో కార్మికుడికి రోజు కూలీ:	రూ.450
నెలకు చెల్లించే మొత్తం:	రూ.1,61,46,000
సర్వీస్ చార్జీ (2 శాతం) మినహాయింపు:	రూ.3,22,920
ఐటీ మినహాయింపు (2 శాతం):	రూ.3,22,920



తాత్కాలిక కార్మికుల వేతనాల్లో కోత

- సర్వీస్ చార్జీ పేరిట రెండు శాతం, ఆదాయ పన్ను కింద మరో రెండు శాతం
- ఎస్‌ఎల్‌ఎఫ్ ద్వారా వేతనాలు చెల్లిస్తున్నందుకు వాత
- ఎస్‌ఎల్‌ఎఫ్ ఎంపికలో చక్రం తిప్పిన వైసీపీ నేత
- కార్మికుల జీతాల్లో మినహాయించుకున్న సొమ్ములో సగం ఆయన జేబులోకే?
- అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని కూటమి నేతల ఆరోపణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులకు వేతనాల చెల్లింపులో వైసీపీకి చెందిన ఓ నేత చేతివాటం ప్రదర్శిస్తున్నారు. కాంట్రాక్టు కార్మికులకు గతంలో మాదిరిగా స్లమ్ లెవెల్ ఫెడరేషన్ (ఎస్‌ఎల్‌ఎఫ్) ద్వారా వేతనాలు చెల్లించాలని ఏడాది కిందట ప్రతిపాదన తీసుకొచ్చిన ఆయన...నాడు కౌన్సిల్‌లో మెజారిటీ ఉండడంతో అనుకూలమైన ఎస్‌ఎల్‌ఎఫ్‌లను ఎంపిక చేసి, వాటి ద్వారా వేతనాలు చెల్లించేలా చక్రం తిప్పారు. నాటి నుంచి కార్మికుల వేతనాల్లో సర్వీస్ చార్జీ కింద రెండు శాతం, ఆదాయ పన్ను కింద మరో రెండు శాతం మినహాయించుకుని ఆ మొత్తాన్ని వాటాలుగా పంచుకుని జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి అధికారంలోకి రావడంతో కొత్త ఎస్‌ఎల్‌ఎఫ్‌లకు బాధ్యతలు అప్పగించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

డెంగ్యూ, మలేరియా నియంత్రణకు జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో పనిచేసే మలేరియా విభాగం ద్వారా ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తుంటారు. వర్షాకాలంలో దోమల సమస్య ఎక్కువ. సీజన్‌లో పనిచేసేందుకు (మూడు నెలలకు) మలేరియా విభాగం ద్వారా తాత్కాలిక కార్మికులను నియమిస్తారు. వీరిని జీవీఎంసీ నేరుగా నియమించుకుంటే భవిష్యత్తులో ఉద్యోగ భద్రత పేరిట ఆందోళనలకు దిగుతారనే ఉంటుందనే ఉద్దేశంతో ప్రైవేటు కాంట్రాక్టర్ ద్వారా తీసుకుంటారు. రోజువారీ కూలీ లెక్కన చెల్లించేలా టెండరు పిలిచి, తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు కార్మికులను సరఫరా చేసే బాధ్యత అప్పగిస్తున్నారు.

ఆదాయ వనరుగా మార్చుకున్న నేత

గత ఏడాది జూన్‌లో ఇలా 406 మంది కార్మికులను కాంట్రాక్టర్ ద్వారా జీవీఎంసీ తీసుకుంది. ఆగస్టులో ఒప్పందం పూర్తవడంతో మరో మూడు నెలలు వారి సేవలను పొడించాలని అధికారులు నిర్ణయించారు. దీంతో జీవీఎంసీ పాలక వర్గంలో కీలక నేత, వైసీపీ నాయకుడు దానిని ఆదాయ వనరుగా మార్చుకోవాలని భావించి ఉన్నతాధికారుల వద్ద కొత్త ప్రతిపాదన పెట్టారు. మలేరియా

... మిగతా 6వ పేజీలో

జిల్లా జడ్జి ధోరణిని నిరసిస్తూ

న్యాయవాదుల విధుల బహిష్కరణ

- 18 నుంచి 20 వరకూ ప్రధాన న్యాయస్థానానికి వెళ్లబోమని ప్రకటన

- 6లో



బాధిత మహిళ ఎస్.పద్మ

ఏడాది పాప అపహరణకు యత్నం!


- ఇంట్లోకి చొరబడిన ఇద్దరు మహిళలు
- ప్రతిఘటించిన ఆమె తల్లిపై హత్యాయత్నం

గాజువాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):


ఏడాది పాపను అపహరించేందుకు ఇద్దరు మహిళలు యత్నించారు. అడ్డుకున్న ఆమె తల్లిపై హత్యాయత్నం చేశారు. ఈ సంఘటన మంగళవారం రాత్రి గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారామనగర్‌లో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి బాధిత మహిళ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతారామనగర్‌లో ఎస్.నాగేశ్వరరావు, ఎస్.పద్మ (30) దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఏడాది వయసు కలిగిన కుమార్తె ఉంది. మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇద్దరు మహిళలు ద్విచక్ర వాహనంపై ఆమె ఇంటికి వచ్చారు. ఆ సమయంలో నాగేశ్వరరావు ఇంట్లో లేరు. వచ్చిన ఇద్దరిలో ఒకరు పద్మను గట్టిగా పట్టుకోగా, ఆమె చేతిలో ఉన్న కుమార్తెను తీసుకునేందుకు మరొకరు యత్నించారు. తన

... మిగతా 6వ పేజీలో

















ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పద్మనాభం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన నరసాపురం గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కాంట్రాక్టర్లు, లబ్ధిదారులతో మాట్లాడి పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. మొత్తం లేఅవుట్‌లో 4200 ఇళ్లు మంజూరు కాగా 495 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె. ఆనందరావు, గృహ నిర్మాణ శాఖ ఈఈ, డీఈలు, ఏఈలు, లేఅవుట్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా పని చేయొద్దు

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- జోన్-2 అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్

కొమ్మాది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పనితీరు మార్చుకోకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని కమిషనర్ సంపత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో జోన్-2 అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధురవాడలో అక్రమ, అనధికార నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.త్వరలో అక్రమ నిర్మాణాల నియంత్రణకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సచివాలయ వార్డు కార్యదర్శులు అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన చర్యలు చేపట్టాలన్నారు. నగర అభివృద్ధిలో జీవీఎంసీ అధికారులది కీలకపాత్ర అన్నారు. జీవీఎంసీలో విలీనమైన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని, కొండవాలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడకుండా రక్షణ గోడలు నిర్మించాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటికి కుళాయి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి లైట్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు తక్కువగా వసూలవుతున్నాయని, రెవెన్యూ అధికారులు వాటిపై దృష్టిసారించాలన్నారు. మధురవాడ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున, ఇక్కడికి ఐటీ పరిశ్రమలు వస్తుండడంతో ప్రజలకు శతశాతం మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు.అనంతరం జోన్‌లో ఉన్న అన్ని విభాగాల సమస్యలను, అభివృద్ధి పనుల గురించి జడ్సీ సింహా చలం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్, అదనపు కమిషనర్ సోమన్నారాయణ, సీఎంహెచ్ఓ నరేశ్ కుమార్, యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణి, పర్యవేక్షక ఇంజనీర్ శ్యామ్‌సన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి అవసరం : విద్యా శాఖ ఆర్‌జేడీ

కొమ్మాది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి. విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పీఎంపాలెం మాలతాంబా విద్యానికేతన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మహంతితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్పోర్ట్స్ మీట్‌లో 300 మంది క్రీడాకారులు పాల్గొనగా రన్నింగ్, త్రోబాల్, షాట్‌పుట్, కోకో, పిరమిడ్స్, యోగాసనాలు, కరాటే, యుద్ధ కళలు వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ఏఓ మధుభట్, పీఎంపాలెం ఎస్ఐ భాస్కర్, ప్రిన్సిపాల్ ఆదిమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, పిడి బి. హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల చివరి వారంలో ధాన్యం కొనుగోలు : ఏఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ కోమలి

భీమునిపట్నం (రూరల్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఈనెల చివరి వారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని మండల వ్యవసాయాధికారిణి బీఎస్ కోమలి తెలిపారు. బుధవారం ఆమె తాళ్లవలస, తాటితూరు గ్రామాల్లో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం మద్దతు ధర గ్రేడ్ ఎ క్వింటాకు రూ. 2.320గా నిర్ణయించామన్నారు పంట కోసిన తర్వాత రైతులు ధాన్యం నిల్వ చేసుకోవడానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సూక్ష్మ సేద్యం పథకం ప్రాజెక్టు డైరెక్టర్ ఎం. మన్మథరావు మాట్లాడుతూ తుంపర్ల సేద్యానికి 50 శాతం, బిందు సేద్యానికి రూ. 80 శాతం రాయితీ అందిస్తున్నామని చెప్పారు. అవసరమైన వారు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది స్వాతి, కృపామణి, హరీశ్, రమేశ్ తదితులు పాల్గొన్నారు.

బాలాలయానికి ఆలయ ముఖ ద్వారం ఏర్పాటు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిప్పాడలో సుత్తమ్మ తల్లి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న బాలాలయం ముఖ ద్వారాన్ని స్థానిక పెద్దలు బుధవారం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు బాలల దినోత్సవం

మధురవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దేశ మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా శిల్పారామంలో గురువారం బాలల దినోత్సవం నిర్వహించనున్నట్టు పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం ఆరు గంటలకు బాలల దినోత్సవంతో పాటు నగరానికి చెందిన సిద్ధేంద్రయోగి నాట్యాలయ కళాకారుల నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.


అల్ప పీడనంతో రైతుల్లో ఆందోళన

పద్మనాభం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ వరి పంట దాదాపు కోత దశకు చేరింది. ఈ సమయంలో వాతావరణ శాఖాధికారుల హెచ్చరికలతో రైతులు భయపడుతున్నారు. మూడు రోజులుగా పంటను కాపాడుకోవడానికి ఉరుకులు, పరుగులు పెడుతున్నారు.

జిల్లా జడ్జి ధోరణిని నిరసిస్తూ న్యాయవాదుల విధులు బహిష్కరణ

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన న్యాయమూర్తి ధోరణిని నిరసిస్తూ మూడు రోజుల పాటు ప్రధాన న్యాయస్థానానికి వెళ్లకూడదని న్యాయవాదుల సంఘం నిర్ణయించింది. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం న్యాయవాదులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ జిల్లా ప్రధాన న్యాయస్థానాన్ని బహిష్కరించనున్నట్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ వెల్లడించారు. దీనిపై ఇప్పటికే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్టు వారు పేర్కొన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ మాట్లాడుతూ విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించినందున ఇక్కడ హైకోర్టు బెంచ్ కూడా ఏర్పాటుచేయాలన్నారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి నరేశ్‌తో పాటు సీనియర్ న్యాయవాది కర్రి ఆదిబాబు, పెద్ద సంఖ్యలో నాయవాదులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఘనంగా ద్వాదశి పూజలు



కొమ్మాది : అన్నంరాజునగర్‌లో ఉన్న అష్ట లక్ష్మీ దేవాలయంలో క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి తులసి మాలలతో లక్ష్మీనారాయణులకు తోమాలసేవ జరిపారు. అనంతరం 108 మంది దంపతులతో 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం చేశారు. అభిషేకం చేసిన పాలు గర్భాలయంలో ఉంచి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు క్షీర సాగరంలో లక్ష్మీనారాయణుల దర్శనం కల్పించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ



శిక్షణలో పాల్గొన్న అధికారులు, సచివాలయ ఉద్యోగులు

ఆనందపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) 13 : పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధి కారులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో డాక్టర్ జానకి చెప్పారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై డ్వాక్రా వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లలకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ప్రణాళిక తయారు చేసినట్లయితే అందుకు అనుగుణంగా నిధులు సమీకరణ జరుగుతుందన్నారు. ఇందులో స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం పంచాయతీల్లో చేపట్టనున్న పలు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే 2025-26 సంవత్సరానికి సంబంధించి నిధుల సమీకరణ, ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. శిక్షకులుగా తర్లువాడ, వెల్లంకి పంచాయతీల కార్యదర్శులు ధనుంజయ, శ్రీరామ్మూర్తి, మండల కంప్యూటర్ ఆపరేటర్ మూర్తి వ్యవహరించారు.

ఆనందపురంలో రుద్ర జ్ఞాన యజ్ఞం

ఆనందపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జీఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రుద్ర జ్ఞాన యజ్ఞం ఘనంగా నిర్వహించారు.ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం అనంతరం ఈ కార్యక్రమాన్ని జరిపారు. కార్యక్రమంలో కోరాడ వెంకటరావు, చందక లక్ష్మి, నాగోతి నాగమణి, కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, కోరాడ అప్పలస్వామి నాయుడు, కోన శ్రీనివాసరావు పైడిరాజు, బంటుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెంటలో 'పొలం పిలుస్తోంది'

పద్మనాభం రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రైతులు అపరాలు. చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపాలని ఏఓ ఎంవీ చలం చెప్పారు. బుధవారం ఆయన పెంట, పద్మనాభం గ్రామాల్లో జరి గిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. రబీలో రైతులు అధిక దిగుబడి, లాభాలు వచ్చే పంటల సాగుపై దృష్టిసారించాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో వేగావతి, ఇంద్రావతి రాగి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెంట సర్పంచ్ బొదల పావని, మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ మేరి కుమారి, ఎంపీఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాగర దుర్గ ఆలయ ప్రారంభోత్సవం

పద్మనాభం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో నూతనంగా నిర్మించిన సాగర దుర్గ అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ మూడు రోజులుగా నిర్వహిస్తున్న విశేష హోమాలు, ప్రత్యేక పూజలు పూర్ణాహుతి అనంతరం విగ్రహ ప్రతిష్ఠతో పాటు శిఖర కలశ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ మాజీ ఛైర్మన్ అక్కరమాని విజయనిర్మల, నెల్లిమర్ల దుర్గా పీఠం చిన్న స్వామి శ్రవణ చైతన్యానంద, వైసీపీ నాయకులు ముత్తంశెట్టి మహేశ్, గాడు శ్రీను, ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు ఎంపీడీఓ విజయకుమార్, మద్ది సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మత్స్యకారుల ధర్నా

భీమునిపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భీమిలి తీర ప్రాంతానికి చెందిన మత్స్యకారులు జోనల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టనున్నట్టు ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ జిల్లా మత్స్యకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ ధర్నా జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు ఎగువపేట ముఖద్వారం వద్ద ఊరేగింపు ప్రారంభమై గంటస్తంభం, పాతబస్టాండ్ మీదుగా జోనల్ కార్యాలయం వద్దకు చేరుకుంటుందని, అక్కడ ధర్నా చేసిన అనంతరం రిలే దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ధర్నాలో మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎండాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :ఎండాడ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 8 నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గొల్లల ఎండాడ, వరహగిరినగర్, ఎండాడ బీసీ కాలనీ, శ్రీనివాసనగర్, సందీపిణినగర్, రాజీవ్‌నగర్, ఎస్సీ, ఎస్టీ కాలనీ, దుర్గానగర్, ముబారక్ కాలనీ, శాంతినగర్, రామాలయం, వివేకానందనగర్, శిరుగుడి నగర్, ఎండాడ పెట్రోల్ బంకు వెనుక భాగం, దసపల్లా లేఅవుట్, తాటిచెట్లపాలెం, లలితానగర్, గణేష్‌నగర్, సుభాష్‌నగర్ ప్రాంతాలకు సరఫరా ఉండదని చెప్పారు.

ముగ్గురు సోషల్ మీడియా యాక్టవిస్టులపై ఫిర్యాదు

ఎండాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని పీఎంపాలెం పోలీసులకు మూడు ఫిర్యాదులందాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టిన రమణరెడ్డి, హరికృష్ణరెడ్డి, షేక్‌జాన్‌ను తక్షణమే అరెస్టు చేయాలన్నారు.

ఉద్యానవనంగా డంపింగ్ యార్డు

... 5వ పేజీ తరువాయి

'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంటును పీపీపీ విధానంలో జిందాల్ కంపెనీ ఏర్పాటుచేసింది. నగరంలో ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న 1100 టన్నుల చెత్తలో దాదాపు 750 టన్నుల తడి చెత్తను ఎనర్జీ ప్లాంట్‌కు తరలించేస్తున్నారు. ఇక పొడి చెత్తలో ప్లాస్టిక్‌ను వేరుచేసి ప్లాస్టిక్ పిల్లెట్‌ల తయారీకి, పేపర్ వేస్ట్‌ను అట్టల తయారీకి, గాజు వ్యర్థాలను గాజు వస్తువులు తయారీకి ముడి సరకు తయారుచేసే యూనిట్లకు, డెబ్రిస్‌ను యార్డులోనే ఉన్న బ్రిక్ తయారీ యూనిట్‌కు అందజేస్తున్నారు. దీనివల్ల ప్రస్తుతం ఏరోజు చెత్త అదేరోజు వివిధ రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా శాస్త్రీయ పద్ధతిలో పునర్వినియోగం అయిపోతోంది. ఎటొచ్చీ లెగసీ వేస్ట్ (గతంలో యార్డులో పేరుకుపోయిన చెత్త)తోనే సమస్య. దానిని జిగ్మా ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ బయో మైనింగ్ చేస్తోంది. లెగసీ వేస్ట్‌ను 'బయో రెమిడేషన్' పద్ధతిలో యంత్రాలతో తవ్వి తీసి అందులోని ప్లాస్టిక్, గాజు, కాగితం, డెబ్రిస్ (కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్) వ్యర్థాలను వేరుచేస్తున్నారు. ఆ తర్వాత ప్లాస్టిక్, గాజు వ్యర్థాలను యార్డులోనే ఏర్పాటుచేసిన సంబంధిత యూనిట్లకు తరలించి వాతావరణానికి ఇబ్బంది తలెత్తకుండా కరిగించేసి పునర్వినియోగానికి అనుగుణంగా మార్చుతున్నారు. అలాగే యార్డులోని భవన నిర్మాణ వ్యర్థాలను సీ అండ్‌డీ యూనిట్ ద్వారా సిమెంట్ బ్రిక్, టైల్స్ తయారుచేస్తున్నారు. ఇప్పటివరకూ 9.5 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను రీసైక్లింగ్ చేయడంతో 33 ఎకరాలు ఖాళీ అయింది. యార్డులో పేరుకుపోయిన లెగసీ వేస్ట్‌ను వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించిన నేపథ్యంలో గతంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన అనుభవంతో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ కాపులుప్పాడ యార్డును పూర్తిగా ఖాళీ చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. దీనిని అమలు చేసే క్రమంలో ఇటీవల ఆయన కాపులుప్పాడ యార్డును సందర్శించారు. అక్కడ ప్రస్తుతం ఉన్న రీసైక్లింగ్ యూనిట్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని ప్రతినిధులను ఆదేశించారు. వచ్చే ఏడాది అక్టోబరు రెండో తేదీ నాటికి యార్డులో ఉన్న లెగసీ వేస్ట్ మొత్తాన్ని ఖాళీ చేయాలనే లక్ష్యంతో కొత్తగా మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ (ఎంఆర్ఎఫ్) యూనిట్ ఏర్పాటుపనులను వేగవంతం చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. యూనిట్ అందుబాటులోకి వస్తే లెగసీ వేస్ట్‌లోని ప్లాస్టిక్, క్లాత్, పేపర్ వంటి వ్యర్థాలను వేరుచేసి వాటిని రీసైక్లింగ్‌కు అవసరమయ్యే ముడిసరకుగా తయారుచేసి ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలకు సరఫరా చేస్తారు. అలాగే బయో సీఎన్‌జీ గ్యాస్ ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించడంతో ఆ యూనిట్‌కు ప్రతిరోజూ 20 టన్నులు తడిచెత్తను అందజేస్తున్నారు. బయో సీఎన్‌జీని నగరంలోని పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారు. భవిష్యత్తులో దీని ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచితే మరింత తడి చెత్త అవసరం అవుతుంది.

చెత్త యార్డును ఉద్యానవనంగా తీర్చిదిద్దుతాం

కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని లెగసీ వేస్ట్‌ను వచ్చే ఏడాది అక్టోబరు రెండు నాటికి పూర్తిగా ఖాళీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఖాళీ అయిన యార్డులో మొక్కలు నాటి ఉద్యానవనంగా మార్చుతాం.యార్డులో ఏళ్ల తరబడి చెత్త పేరుకుపోయి ఉండడంతో భూమిలోకి ప్రమాదకరమైన రసాయనాలు చేరి ఉంటాయి. కాబట్టి ఆ భూమిలో కనీసం 15 సంవత్సరాలపాటు గ్రీన్ బెల్ట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. తర్వాత ఏదైనా అవసరాలకు భూమిని వాడుకునేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం యార్డులో 9.5 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను ఖాళీ చేయడంతో 33 ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. ఆ భూమిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్

మెట్రో ప్రాజెక్టుపై వాడీవేడిగా..

... 5వ పేజీ తరువాయి

నిరిస్తారా?, విడిగా నిర్మిస్తారా?...వివరించాలని కోరారు.

కేంద్రం నుంచి అనుమతి రాగానే ముందుకు వెళతాం

పి. నారాయణ, పురపాలక శాఖ మంత్రి

ఈ అంశంపై పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. విశాఖ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర రవాణా ప్రణాళిక కేంద్రానికి సమర్పించామని, అనుమతి రాగానే ముందుకు వెళతామని చెప్పారు. గాజువాక నుంచి కొమ్మాది వరకు 42.5 కి.మీ. పొడవున మూడు కారిడార్ల నిర్మాణానికి డీపీఆర్ తయారుచేసి నాటి టీడీపీ ప్రభుత్వం కేంద్రానికి పంపిందన్నారు. టెండర్లు పిలవగా కొన్ని కంపెనీలు బిడ్లు కూడా వేశాయన్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టెండర్లు రద్దు చేసి కారిడార్‌ను భోగాపురం విమానాశ్రయం వరకూ పొడిగించిందని, దాంతో కేంద్రం దానిని పక్కన పెట్టేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆ తరువాత ముందుకు వెళ్లలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కోల్‌కతా మెట్రో రైలు తరహాలో వంద శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చేలా, రైల్వే శాఖకు ప్రాజెక్టు అప్పగించేలా ప్రతిపాదనలు కేంద్రానికి పంపించామన్నారు. రెండు దశల్లో నాలుగు కారిడార్లు నిర్మిస్తామన్నారు. మొదటి దశలో 46.23 కి.మీ. పొడవున మూడు కారిడార్లు వస్తాయన్నారు. మొదటి కారిడార్ స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకూ 34.4. కి.మీ., రెండో కారిడార్ గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.07 కి.మీ., మూడో కారిడార్ తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు 6.75 కి.మీ. ఉంటుందన్నారు. దీనికి రూ.11,498 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశామన్నారు. రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు 30.67 కి.మీ., 12 స్టేషన్లతో మెట్రో నిర్మాణానికి ప్రతిపాదన చేశామన్నారు. మెట్రో కారిడార్ వెళ్లే మార్గంలో ఎక్కువ క్రాసింగ్స్ ఉన్నందున ప్రతి క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా కార్‌షెడ్డు, ఎండాడ, హనుమంతవాక, మద్దిలపాలెం, విప్రో, గురుద్వారా, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, గాజువాక, స్టీల్‌ప్లాంటు జంక్షన్ల వద్ద టూలెవెల్ మెట్రో,ఫ్లైఓవర్లు నిర్మించాలని ప్రతిపాదించామన్నారు.

మహా మేత

... 5వ పేజీ తరువాయి

తాత్కాలిక కార్మికులకు కాంట్రాక్టర్ ద్వారా సక్రమంగా వేతనాలు అందడం లేదని, అందువల్ల యూసీడీ పరిధిలో కొన్ని ఎస్ఎల్ఎఫ్‌లను ఎంపిక చేసి వాటి ద్వారా చెల్లించాలని సూచించారు. పాలక వర్గంలో కీలక నేత కావడంతో ఈ ప్రతిపాదనను అధికారులు ఆగమేఘాలపై అమలుచేశారు. యూసీడీ అధికారులు సదరు నేత సూచించిన ఎస్ఎల్ఎఫ్‌లను జోన్‌ల వారీగా ఎంపిక చేసి వారి ఖాతాల్లో కార్మికుల వేతనాలు జమ చేయడం ప్రారంభించారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులు 790 మందికి కూడా ఎస్ఎల్ఎఫ్‌ల ద్వారానే వేతనాలు చెల్లించేలా ఆ విభాగం అధికారులపైనా ఒత్తిడి చేశారు.

నెలకు రూ.3.23 లక్షలు మినహాయింపు

మలేరియా విభాగంలో 406 మంది, పారిశుధ్య విభాగంలో 790 మంది తాత్కాలిక కార్మికులకు రోజుకు రూ.450 చొప్పున జీవీఎంసీ చెల్లిస్తోంది. ఈ మొత్తం రూ.1,61,46,000 ఎస్ఎల్ఎఫ్‌ల ఖాతాలకు జమ చేస్తోంది. వేతనాలను చెల్లిస్తున్నందుకు గానూ ఎస్ఎల్ఎఫ్‌లు సర్వీస్ చార్జీ కింద రెండు శాతం మినహాయించుకుంటున్నాయి. అంటే నెలకు సుమారు రూ.3.23 లక్షలు. ఆ మొత్తాన్ని తమ పరిధిలోని మహిళా సంఘాలకు పంచాలి. ఇదికాకుండా కార్మికుల వేతనాలను జీవీఎంసీ నుంచి తీసుకుని కార్మికులకు అందజేసే క్రమంలో భారీగా లావాదేవీలు జరుగుతుంటాయి కాబట్టి రెండు శాతం మొత్తాన్ని ఐటీ కింద మినహాయించారు. కార్మికులు ఐటీ రిటర్న్స్ లేదా ఐటీ శాఖ నుంచి ప్రత్యేక అనుమతితో ఆ మొత్తాన్ని తిరిగి పొందే వీలుంటుంది. సంబంధిత పత్రాన్ని ఎస్ఎల్ఎఫ్‌లకు అందజేస్తే వారు ఐటీ శాఖకు పంపి, మినహాయించిన మొత్తాన్ని తిరిగి పొందడం ద్వారా కార్మికులకు ఇవ్వాలి. కానీ కార్మికులకు ఐటీ రిటర్న్స్‌పై అవగాహన ఉండదు కాబట్టి ఎస్ఎల్ఎఫ్‌లు తమ ఖాతాలోనే ఆ మొత్తాన్ని ఉంచుకుంటున్నాయి. సర్వీస్ చార్జీ కింద మినహాయిస్తున్న మొత్తంలో ఎస్ఎల్ఎఫ్‌ల అధ్యక్ష, కార్యదర్శులకు కొంత, మిగిలిన మొత్తాన్ని వైసీపీ నేత జేబులో వేసుకుంటున్నారని కూటమి కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం లేవనెత్తడంతో సభలో వాదోపవాదాలు జరిగాయి. తాజాగా కొంతమంది స్టాండింగ్ కమిటీ సభ్యులు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించడంతోపాటు కార్మికులకు వేతనాలు ఇస్తున్న ఎస్ఎల్ఎఫ్‌లను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

ఏడాది పాప అపహరణకు యత్నం!

... 5వ పేజీ తరువాయి

కుమార్తెను గట్టిగా పట్టుకుని వదలకపోవడంతో పాపను అపహరించేందుకు వచ్చిన మహిళలు బ్లేడ్‌తో పద్మ మెడపై గాయపర్చారు. ఆమె చేతిపై కూడా గాయమైంది. ఈ సమయంలో పద్మ పెద్దగా కేకలు వేయడంతో ఇద్దరు మహిళలు వాహనంపై పరారయ్యారు. వారిద్దరూ రెండు రోజుల నుంచి ఇదే మార్గంలో తిరుగుతున్నారని, మంగళవారం రాత్రి మాత్రం నేరుగా ఇంటికి వచ్చి పాపను అపహరించేందుకు యత్నించారని పద్మ తెలిపింది. దీనిపై గాజువాక పోలీసులకు పద్మ సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

కొమ్మాది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గాయత్రి విద్యా పరిషత్ ఆస్పత్రి అనస్తీషియా ప్రొఫెసర్ కె. చంద్రశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల విని యోగం వల్ల జీవితాలు నాశనం అవుతాయని చెప్పారు. ఈ కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె. సురేశ్, ఫైనాన్స్ డైరెక్టర్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

విమాన భద్రతపై సదస్సు


కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం అధికారులు విమాన భద్రతపై మంగళ, బుధవారాల్లో వార్షిక సదస్సును నిర్వహించారు. ఐఎన్ఎస్ డేగాలో జరిగిన సదస్సుకు తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నేవీ ఎయిర్ ఆపరేషన్లకు ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలు చర్చించారు. మానవ రహిత విమానాలు, సైబర్ సెక్యూరిటీ, సునిశిత శిక్షణ వంటి అంశాలను అధ్యయనం చేయాలని నిర్ణయించారు. దీనికి ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, కోస్టుగార్డుల ప్రతినిధులు హాజరయ్యారు.

గవర కార్పొరేషన్ సభ్యుడిగా మళ్ల రవికుమార్



వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సాయంత్రం నియమించిన వివిధ కార్పొరేషన్ల సభ్యులలో గవర కార్పొరేషన్ సభ్యుడిగా విశాఖ తూర్పు 15వ వార్డు పాత వెంకోజీపాలేనికి చెందిన మళ్ల రవికుమార్‌కు చోటు దక్కింది. తొలి నుంచి టీడీపీకి విధేయుడైన రవికుమార్ పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు. ప్రస్తుత ఆడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘంలో సహాయ కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తూ అనేక గవర కులస్తుల సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అలాగే 15వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శిగా గత 7 ఏళ్లుగా వార్డులో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

పెదగదిలి శివాలయంలో క్షీరాబ్ది ద్వాదశ పూజలు

ఆరిలోవ, నవంబరు 13 : ఆరిలోవలో గల పలు శివాలయాల్లో బుధవారం క్షీరాబ్ధి ద్వాదశ పూజా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిలోవ గల బాలాత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వరస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు వచ్చి కీరాబ్ది ద్వాదశ పూజల్లో పాల్గొన్నారు. పురోహితులు, అర్చకులకు ధాన్య, వస్త్రదానాలు తదితరాలు చేశారు. పెదగదిలిలో గల కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు పలు దానాలు సమర్పించారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 26, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 32, క్యారెట్ 54 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)55, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 62, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	97
ఫారం ధర	117
విత్ స్కిన్	204
స్కిన్‌లెస్	214

ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల కమిటీ ఏయూ సందర్శన


కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసిన ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల కమిటీ బృందం బుధవారం ఏయూను సందర్శించింది. ముందుగా పాలకమండలి సమావేశం మందిరంలో ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఇతర అధికారులతో కమిటీ సభ్యులు ఆచార్య జుబైదా అన్సారీ, డాక్టర్ రమా కొండపల్లి, డాక్టర్ ప్రశాంత్ ఆర్ నాయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య గిరిజా శంకర్ ఏయూ ఐక్యూ ఏసీ కేంద్రం పని చేస్తున్న విధానం తదితర అంశాలను వివరించారు.

అనంతరం కమిటీ ప్రతినిధులు ఏయూ కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ కమిటీ, టాస్క్ ఫోర్స్ కమిటీలతో సమావేశం అయ్యారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌కు ఏయూ అనుసరిస్తున్న విధానం తదితర అంశాలను వీరికి ఆచార్య గిరిజా శంకర్ వివరించారు. తదుపరి ఏయూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇన్నోవేషన్ సెంటర్, నానో టెక్నాలజీ సెంటర్, నార్త్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ సెల్, అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఫుడ్ డ్రగ్ టెస్టింగ్ లేబరేటరీ, అమెరికన్ కార్నర్, అల్యూమ్ని అసోసియేషన్ ఆఫీస్, డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఆఫీస్, సౌత్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ కార్యాలయం, డాక్టర్ వీఎస్ కృష్ణా సెంట్రల్ లైబ్రరీలను సందర్శించారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులం విద్యార్థికి అస్వస్థత

- కేజీహెచ్‌లో చికిత్స
- ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు


విద్యార్థికి విమ్స్ నుంచి కేజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

ఆరిలోవ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారం సమీపంలో గల శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులంలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి అస్వస్థకు గురయ్యాడు. గురుకులం సిబ్బంది సకాలంలో స్పందించి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులంలో ఆరో తరగతి చదువుతున్న రవీంద్రకుమార్ బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో పాఠశాల సిబ్బంది అతడిని శ్రీకృష్ణాపురంలో గల ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి 'విమ్స్'కు తీసుకెళ్లమని చెప్పారు. వెంటనే ప్రిన్సిపాల్ రత్నవల్లి స్పందించి విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు జ్వరం ఎక్కువగా ఉందని, ఫిట్స్ వస్తున్న లక్షణాలు కనిపిస్తున్నాయని పేర్కొంటూ కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని సలహా ఇచ్చారు. వెంటనే విమ్స్ అంబులెన్స్‌లో రవీంద్రకుమార్‌ను కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందేలా చూశారు. గురుకులం కో-ఆర్డినేటర్ రూపవతి కేజీహెచ్‌కు వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం రవీంద్రకుమార్‌కు ప్రమాదం ఏమీ లేదని, ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపినట్టు చెప్పారు.

కాగా, కొంతమంది గురుకులంలో 70 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత నెలకొందంటూ సెల్‌ఫోన్లలో సందేశాలు పంపారని, అయితే అటువంటిదేమీ లేదని రూపవతి తెలిపారు. సుమారు 17 మంది విద్యార్థులు దురదలు, బాడీ పెయిన్స్‌తో బాధపడుతున్నారని చెప్పారు. వారందరికీ వైద్యం అందిస్తున్నట్టు ఆమె వెల్లడించారు. గురుకులంలో విద్యార్థులందరిక ఆరోగ్యం బాగా ఉందని, ఎలాంటి ఆందోళన వద్దని ఆమె కోరారు.

ఘనంగా గ్రంథాలయాల వారోత్సవాలు నిర్వహించాలి


పోస్టల్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు పిలుపునిచ్చారు. కళాశాలలో బుధవారం ఆయనవారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ గ్రంథాలయ పితమహుడు ఎస్ఆర్ రంగనాథన్ గుర్తుగా ప్రతి ఏటా గ్రంథాలయ జాతీయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు కళాశాలలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు శ్రావణ్‌కుమార్, ఎస్వీ రామారావు, పి.ధనలక్ష్మి, వై. శాంతిప్రభ, పోల ఉమామహేశ్వరరావు, విజయప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం వద్ద పెట్రోల్ బంకు ఏర్పాటుపై చర్చలు

- ఐవోసీ, జైలు అధికారుల సమావేశం

ఆరిలోవ, నవంబరు 13 : (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్ర కారాగారంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులతో జైలు సూపరింటెండెంట్ కిశోర్, శ్రీకాకుళం జైలు సూపరింటెండెంట్ సన్యాసిరావు, ఐవోసీ రీజనల్ మేనేజర్ ప్రశాంత్ సమావేశమయ్యారు. కేంద్ర కారాగారానికి సమీపంలో గల స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు 2015లో అప్పుడు ఇక్కడ డెప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న సన్యాసిరావు పలుమార్లు సంప్రదింపులు జరిపారు. జీవీఎంసీ నుంచి అనుమతి కూడా లభించింది. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో బంకు ఏర్పాటుకు అనుమతి రాలేదు. దీంతో పెట్రోల్ బంకు ఏర్పాటు అంతటితో ఆగిపోయింది.

తాజాగా.. జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రస్తుతం శ్రీకాకుళం జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న సన్యాసిరావుకు ఆ బాధ్యతలు అప్పగించారు.

ఈ నేపథ్యంలో బుధవారం ఐవోసీ ప్రతినిధులు, జైలు శాఖ అధికారులు సమావేశమయ్యారు. గురువారం కూడా చర్చలు జరపనున్నట్టు వారు తెలిపారు. వీరి చర్చయలు ఫలిస్తే కేంద్ర కారాగారం సమీపంలో పెట్రోల్ బంకు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంటుంది.

తత్త్వశాస్త్ర విద్యార్థులది గురుతర బాధ్యత


విద్యార్థులకు సందేశాన్ని ఇస్తున్న బౌద్ధ భిక్షువు పూంటశ్వక్

వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తత్త్వ శాస్త్ర విభాగంలో టిబెట్‌కు చెందిన బౌద్ధ భిక్షువు పూంటశ్వక్ బుధవారం సందర్శించి అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దుఃఖ నుంచి విముక్తిని పొందే మార్గాన్ని ప్రజలకు తెలియజేయడం తత్త్వశాస్త్ర విద్యార్థుల గురుతర బాధ్యత అన్నారు. బౌద్ధ ధర్మం మానవున్ని దుఃఖ విముక్తున్ని చేస్తుందన్నారు. కోరికలను పరిమితంగా ఉంచడం ద్వారా మానవ జీవితానికి దుఃఖ విముక్తి లభిస్తుందని, తద్వారా మానవుడు మోక్షం పొందగలడని పేర్కొన్నారు. బౌద్ధమతం ప్రకారం నాలుగు మహాసత్యాలు ఉన్నాయని, ఈ ప్రపంచం దుఃఖంతో నిండిందని, దుఃఖానికి కారణం కోరిక, కోరికను జయించడం ద్వారా దుఃఖాన్ని జయించవచ్చునని, కోరికను జయించడానికి ఆర్య అష్టాంగ మార్గం అనుసరించాలని చెప్పారు. ఈ మార్గాన్ని అనుసరించే వారు ప్రశాంత జీవితం గడపవచ్చని, ఈ మార్గం మన ఆత్మీయ సామర్థ్యాన్ని తెలుసుకోవడంలో సహాయపడుతుందన్నారు. ఈ మార్గాన్ని అనుసరించడం ద్వారా కోపం, అసూయ, లోభం వంటి నైజాలు దాటవచ్చన్నారు. ఈ మార్గం మన మనసుకు స్పష్టతనూ, దూరదృష్టిని పెంపొందిస్తుందని, ప్రశాంత స్థితిని అందిస్తుందని, ఇంకా మనలోని అవగాహనను మెరుగుపరుస్తుందని, చివరికి ఈ మార్గం మానవుడు నిర్వాణాన్ని సాధించటానికి సహాయపడుతుందని వివరించారు. కార్యక్రమంలో తత్త్వ విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు


కార్యక్రమంలో పాల్గొన్న వెంకటశేషమ్మ, వైద్యులు, పాఠశాల సిబ్బంది

పెదవాల్తేరు, నవంబరు 13 : మానసిక దివ్యాంగ బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ వెంకటశేషమ్మ సూచించారు. బుధవారం పెదవాల్తేరు సన్‌ఫ్లవర్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సంస్థలో చదువుతున్న మూగ, చెముడు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మానసిక శారీరక, ఈఎన్టీ సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చినవాల్తేరు ముఖ్యమంత్రి ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ శ్రీరమ్య డాక్టర్ ప్రతీప్, డాక్టర్ స్వేతారావు, సన్‌ఫ్లవర్ సంస్థల ప్రిన్సిపాల్ కృష్ణవేడి తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలతో విద్యార్థుల మాటామంతీ


వృద్ధులతో మాట్లాడుతున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మానవ సేవే, మాధవ సేవ అని పిలుపునిచ్చిన సత్యసాయిబాబా దివ్య సందేశాన్ని అమలు చేయడంలో భాగంగా సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో బుధవారం పలు సేవలను అందించారు. సత్యసాయి 99వ జన్మదినోత్సవాల్లో భాగంగా వానప్రస్థ ఆశ్రమం, వైజాగ్ ఓల్డ్ ఏజ్ హోంలలో పదో తరగతి విద్యార్థులు అక్కడి అవ్వాతాతలతో ఆప్యాయంగా పలకరించి మాట్లాడారు. వారికి నిత్యావసర సరుకులు, దుస్తులు, పండ్లు, పారిశుధ్య సామగ్రి అందించారు. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విమానాశ్రయానికి కొత్త రాడార్



విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం నిఘా కోసం కొత్త రాడార్‌ను ఏర్పాటు చేశారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూపొందించిన ఈ అధునాతన రాడార్‌ను డాల్ఫిన్స్ నోస్ కొండపై పెట్టారు. విమానాశ్రయం పరిసరాల్లో గగనతలంపై విమానాల రాకపోకలకు సంబంధించిన సమాచారం నిరంతరం దీని నుంచి అధికారులకు అందుతుంది. ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు ఇది ఎంతగానో దోహద పడుతుందని ఐఎన్ఎస్ డేగా అధికారులు పేర్కొన్నారు. ఈ రాడార్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందిస్తున్న కార్పొరేటరు మంగవేణి

ఎంవీపీ కాలనీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విజయవాడ వరద ప్రాంతాల్లో పారిశుధ్య సేవలను అందించిన జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణిపోలారావు బుధవారం ఆమె నివాసం వద్ద సన్మానించారు. జీవీఎంసీ అందించిన వస్త్రాలను సిబ్బందికి ఇచ్చారు. నాటి విలయంలో ప్రశంసనీయమైన సేవలు అందించారని, పారిశుధ్య సిబ్బంది సేవల వల్ల వరద ప్రాంతాలు త్వరగా కోలుకున్నాయని అన్నారు.

వెంకోజీపాలెంలో..


వస్త్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు పారిశుధ్య కార్మికులకు వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య నూతన దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విడయవాడ ప్రజలు కష్ట సమయంలో వున్నపుడు ముంపునకు గురైన ప్రాంతాలలో సేవలు అందించిన శానిటరీ సిబ్బంది అభినందనీయమన్నారు. ప్రభుత్వం కూడా వీరి సేవలు గుర్తించిందన్నారు. ఎప్పటికప్పుడు వార్డుల్లోని చెత్తను తొలగిస్తూ శుభ్రంగా తీర్చిదిద్దడంలో కార్మికులు చేస్తున్న సేవ ఎన్నలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పారి వెంకట గిరిబాబు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌కుమార్, మేస్త్రి రమణ, శ్రీను పాల్గొన్నారు.

24 గంటల్లో దొంగల్ని పట్టేశారు

- మల్కాపురం, పెందుర్తి పోలీసులకు ఉన్నతాధికారులు అభినందనలు

పెందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల జరిగిన చోరీల కేసుల్లో 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్న పెందుర్తి, మల్కాపురం పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు. పెందుర్తి కేసుకు సంబంధించి ఎస్ఐ డి. సూరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం..

ఆర్ఆర్‌వీ పురం పవర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న క్రిష్ణి చికెన్ రెస్టారెంట్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రెస్టారెంట్‌కు చెందిన సీసీ కెమెరాల వైర్లను కత్తిరించి, షట్టర్ల తాళాలు పగలు కొట్టి నిందితుడు లోపలికి ప్రవేశించాడు. రెస్టారెంట్‌లో ఉన్న ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీ, బిల్లింగ్ మానిటర్, ప్రింటర్ చోరీ చేశాడు. ఉదయం రెస్టారెంట్‌కు వచ్చిన సిబ్బంది షట్టర్ తెరిచి ఉండడంతో విషయాన్ని నిర్వాహకుడు పోతురాజుకు చెప్పగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సూరిబాబు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సీసీ కెమెరాల్లో సరైన ఆధారాలు లభించకపోవడంతో షట్టర్ చోరీలో ఆరితేరిన దొంగలపై నిఘా పెట్టారు, ఈమేరకు అక్కయ్యపాలెంకు చెందిన పాత నేరస్తుడు గోడాది హరి సంపత్ (26) అలి యాస్ హరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు, చోరీ జరిగిన 24 గంటల్లోనే నింది తుడ్ని పట్టుకున్న ఎస్ఐ సూరిబాబు, హెచ్‌సీలు నాగరాజు, ఎంఎస్ నాయుడు, శివప్రసాద్, దేవుడు నాయుడును ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు అభినందించారు

శ్రీహరిపురం ఎంఐజీ క్వార్టర్స్‌లో...

మల్కాపురం : శ్రీహరిపురం ఎంఐజీ క్వార్టర్స్‌లో చోరీకి పాల్పడిన దొంగను మల్కాపురం పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. ఏడీసీపీ మోహన్‌రావు, క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివ రాలు ప్రకారం.. క్వార్టర్స్‌లో నేవీ రిటైర్డ్ అధికారి ప్రసాద్ సింగ్ నివాసం ఉంటున్నారు. ఈనెల 4న కుటుంబంతో కలిసి టూర్‌కు వెళ్లారు, తిరిగి 11న వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళాలు పగలుగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి, ఇంట్లోకి వెళ్లి చూడగా 18 తులాల బంగారం, రూ. 1.50 లక్ష నగదు చోరీ అయినట్టు గుర్తించి, మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, సీసీ కెమెరా ఆధారంగా దొంగను పట్టుకున్నారు.

రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన దాసరి వరహహరి (47) శ్రీహరిపురం ప్రాంతానికి వచ్చి ఆటోలో పాలు రవాణా చేస్తూ జీవనం కొనసాగిస్తూనే దొంగతనాలు కూడా చేస్తుండేవాడు. అందులో భాగంగా 4న ఎంఐజీ క్వార్టర్స్‌లో ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గుర్తించి 6వ తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో చోరీకి పాల్పడ్డాడు. పోలీసులు 4వ తేదీ నుంచి 11 వరకు ఈ మార్గం మీదుగా రాత్రి వేళ ఎవరెవరు తిరిగారన్నది సీసీ కెమెరాల ఆధారంగా పరిశీలించగా హరి ఎక్కువగా తిరగడం గుర్తించి, అదుపులోకి తీసుకుని విచారించగా, నేరం అంగీకరించాడు. 24 గంట్లో కేసును చేధించిన ఎస్ఐ రమణను, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

కల్తీ ఆహారం ప్రధాన సమస్యగా గుర్తించాలి

- జనజాగరణ సమితి ఆందోళన


తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జనజాగరణ సమితి నాయకులు

మద్దిలపాలెం, నవంబరు 13 : రాష్ట్ర ప్రభుత్వం కల్తీ ఆహారాన్ని ప్రధాన సమస్యగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద జనజాగరణ సమితి నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ కల్తీ ఆహారాన్ని ప్రధాన సమస్యగా గుర్తించి అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. కల్తీ ఆహారం తినడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం విక్రయించే వారు ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారని, అలాంటి వారిని విధుల నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జన జాగరణ సమితి నాయకులు సునీల్‌కుమార్, దేవర శంకర్, సంజయ్, కృష్ణ కౌశిక్‌పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరల నియంత్రించాలి


పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం, నవంబరు 13 : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక పిఠాపురం కాలనీ సచివాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మద్దిలపాలెం జోన్ కమిటీ సభ్యుడు పెంటకోట వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. వంట నూనె లీటరుపై ఏకంగా రూ.50 పెరిగిందని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలపై నియంత్రణ ఎత్తివేయడం వలే ధరలు పెరుగుతున్నాయన్నారు. మరో పక్క సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల భారం వేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్ విలీనం చేయకుండా ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చలపతి, కుమార్‌మంగళం, కుమారి, వెంకటరావు, అప్పారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పోలీసు అరెస్టు



ఆరిలోవ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పోలీసును పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకొని ఆరిలోవ పోలీసుస్టేషన్‌కు తరలించారు.ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన వంతల వెంకటరమణ (33) పోలీసు యూనిఫారం ధరించి జాతీయ రహదారిపై డెయిరీ ఫాం వద్ద సెల్‌ఫోన్లు అమ్మేందుకు యత్నిస్తుండగా, స్థానికులు అనుమానించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీఎం పాలెం క్రైం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు.

కాగా, వంతల వెంకటరమణపై ఇది వరకే పలు సబ్బవరం పీఎస్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసుతో కలిసి ఇతడిపై 12 కేసులు ఉన్నట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. తాజా ఘటనపై కేసు నమోదు చేసినదర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

శ్మశాన అభివృద్ధి పనులు ప్రారంభించండి

- 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్


మూర్తియాదవ్‌తో చర్చిస్తున్న జవీఎంసీ అధికారులు

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులోని శ్మశానం అభివృద్ధికి ఆమోదం పొందిన పనులకు టెండర్లు ఖరారెనాజాప్యం చేయడంపై కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ బుధవారం శ్మశానంలో నిరాహారదీక్ష చేపట్టారు. ప్రహరీ రిపేర్లు, భివృద్ధి పనులకు రూ.56.83 లక్షలతో పనులు చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారన్నారు. ఏడాది గడుస్తున్నా పనులు చేపట్టకపోవడంపై మూడుసార్లు కౌన్సిల్‌లో ప్రస్తావించినా స్పందన లేదన్నారు. తనపై కక్షతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. జోన్-3 కమిషనర్ శివప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు చేరుకుని 45 రోజుల్లో పనులు పూర్తిచేస్తామని హామీ లేఖ అందజేయడంతో దీక్ష విరమించారు.

సంప్రదాయబద్ధంగా క్షీరాబ్ది ద్వాదశి పూజలు

వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆషాడంలో నిద్రలోకి వెళ్లి క్షీరాబ్ధి ద్వాదశి రోజున నిద్ర మేల్కొని విష్ణుమూర్తికి తులసి మాలతో వివాహం చేస్తే సకల పాపాలు హరించుకు పోతాయని భక్తులంతా ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, బుధవారం ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద తులసి మొక్కకు పూజలు నిర్వహించి, దీపారాధన చేసి, అనంతరం ఆలయాలకు వెళ్లి బ్రాహ్మణులకు స్వయంపాక, దీపదానం చేశారు. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో అర్చకులు అరవెల్లి సూర్య ప్రకాష్ శర్మ, రామకృష్ణ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రిలు భక్తుల నుంచి స్వయంపాకాలు స్వీకరించి, వారిని ఆశీర్వదించారు.

జీతాలు చెల్లించాలంటూ ధర్నా

సిరిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు జి.మంగశ్రీ డిమాండ్ చేశారు.బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్స్ గడిచిన 10 ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. వీరికి కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వేతనాలు చెల్లించలేదన్నారు. దీంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇప్పుడు ఇస్తున్న రూ.6 వేల వేతనాన్ని పెంచాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు బంగారమ్మ, వసంత, టి.లక్ష్మి, వై.లక్ష్మి, కె.లక్ష్మి, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ టవర్స్‌లో అగ్నిప్రమాదం

సీతమ్మధార, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార ప్రాంతంలో ఉన్న ఆక్సిజన్ టవర్స్‌లోని 32వ అంతస్తులో గల ఓ ఫ్లాట్‌లో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. తొలుత ఫ్లాట్‌లో నుంచి పొగలు, మంటలు రావడాన్ని గమనించిన ఇరుగుపొరుగువారు అప్రమత్తమై తలుపు తెరవడానికి ప్రయత్నించగా లాక్ పడింది.. లోపల ఓ బాలుడు ఉన్నట్టు గమనించి సమీపంలో ఉన్న వెల్డర్‌ను రప్పించి తాళాలు పగులగొట్టి ఆ బాలుడ్ని బయటకు తీశారు. ఆ అంతస్తులో ఉన్న మిగిలిన ఇళ్లవారు భయంతో ఉరుకులు, పరుగులతో కిందికి దిగి తమను తాము కాపాడుకున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. అదే సమయంలో అక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయి చీకటిగా ఉండడంతో ఎవరికీ ఏమీ కనిపించలేదు. ప్రమాదం జరిగిన ఫ్లాట్‌లో కుటుంబ పెద్దలు ఎక్కడ ఉన్నదీ తెలియలేదు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు వచ్చి పరిశీలిస్తున్నారు. ప్రమాద కారణాలు, ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

సింహాద్రి ఎక్స్‌ప్రెస్, కాకినాడ పాసింజర్ రద్దు

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధి రాఘవపురం, రామగుండం స్టేషన్ల మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పినందున గురువారం గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), కాకినాడ పోర్టు-విశాఖ (17267), విశాఖ-కాకినాడ పోర్టు (17268) రైళ్లు రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 15న విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240)ను కూడా రద్దు చేస్తున్నట్టు తెలిపారు.

రద్దీగా ఉండే రైళ్లకు అదనపు ఏసీ, స్లీపర్ క్లాసు కోచ్‌లు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు (18463) ఈ నెల 14 నుంచి 21 వరకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు, బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు (18464) ఈ నెల 15 నుంచి 22 వరకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు, భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (22879) ఈ నెల 16న రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు, తిరుపతి-భువనేశ్వర్(22880) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 17న రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు జత చేస్తున్నట్టు తెలిపారు. విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్‌కు (20805) ఈ నెల 15 నుంచి 30 వరకు సెకెండ్ ఏసీ కోచ్, న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్‌కు (20806) ఈ నెల 17న సెకెండ్ ఏసీ కోచ్, విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు (22847) ఈ నెల 24న థర్డ్ ఏసీ కోచ్, ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (22848) ఈ నెల 26న థర్డ్ ఏసీ కోచ్, విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు (18519) ఈ నెల 25 నుంచి 30 వరకు థర్డ్ ఏసీ, ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (18520) ఈ నెల 27 నుంచి డిసెంబరు 2 వరకు థర్డ్ ఏసీ కోచ్, విశాఖ-డిఘా ఎక్స్‌ప్రెస్‌కు (22874) ఈ నెల 28న థర్డ్ ఏసీ కోచ్, డిఘా-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (22873) ఈ నెల 29న ఒక థర్డ్ ఏసీ కోచ్, గాంధీధాం-పూరి ఎక్స్‌ప్రెస్‌కు (22973) ఈ నెల 20, 27న ఒక స్లీపర్ క్లాసు కోచ్, పూరి-గాంధీధాం ఎక్స్‌ప్రెస్‌కు (22974) ఈ నెల 23, 30న ఒక స్లీపర్ క్లాసు జత చేస్తున్నట్టు పేర్కొన్నారు.

కోరాపుట్, జగదల్‌పూర్ సెక్షన్‌లో డీఆర్‌ఎం పర్యటన

వాల్తేరు డివిజన్ పరిధిలోని కోరాపుట్, జగదల్‌పూర్ సెక్షన్‌లో డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ బుధవారం తనిఖీలు చేపట్టారు. డబుల్ లైను పనులు, అభివృద్ధి కార్యకలాపాలను పరిశీలించి సివిల్ ఇంజనీర్, ఆపరేషన్స్, ఎలక్ట్రికల్, టెలికాం, కమర్షియల్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం దిలిమిలి, దంతెవార స్టేషన్లకు చేరుకుని అక్కడి ప్రయాణికుల సదుపాయాలను పరిశీలించారు. వివిధ ప్రాంతాల్లోని లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలపై అధికారులతో చర్చించారు. అధికారులతో సంప్రదించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దిశగా పలు సూచనలు చేశారు.

నేటి నుంచి కేన్సర్ స్ర్కీనింగ్ సర్వే


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తదితరులు

సీతంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మధుమేహం, అధిక రక్తపోటు, సాధారణ కేన్సర్‌లు(ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్) స్ర్కీనింగ్ సర్వే గురువారం నుంచి ప్రారంభమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఆంధ్ర వైద్య కళాశాలలో ఉన్న వైద్య నిపుణులు హూమీ భాభా పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ స్థాయిల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి యుక్త వయసు దాటిన అందరికీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 30 సంవత్సరాల వయసు దాటిన వారికి నోటి కేన్సర్ పరీక్ష, ఇదే వయసు మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ల కోసం వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధారణ ప్రజానీకానికి పూర్తి అవగాహన కల్పించాలని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నిరాశ్రయ ఆశ్రమాలను తరలించొద్దు: మెప్మా ఎండీ

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని పట్టణ నిరాశ్రయ ఆశ్రమాలను శివారు ప్రాంతాలకు తరలించవద్దని ఆదేశిస్తూ మెప్మా ఎండీ ఎన్.తేజ్‌భరత్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. నగరంలో భిక్షాటన చేసుకునేవారు, అనాథలు, మానసిక రుగ్మతలతో రోడ్లపై తిరిగేవారు, వృద్ధాప్యంలో ఆదరణకు నోచుకోని వారికి ఆశ్రయం కల్పించేందుకు జీవీఎంసీ, మెప్మా సంయుక్తంగా పట్టణ నిరాశ్రయ ఆశ్రమాలను నిర్వహిస్తున్నాయి. వీటిలో కొన్నింటిని నగర శివారు ప్రాంతాలకు తరలించాలనే ప్రతిపాదన జీవీఎంసీ అధికారుల్లో ఉన్నట్టు ప్రచారం జరగడంతో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ మెప్మా ఎండీకి ఫిర్యాదు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రైల్వేస్టేషన్, బస్టాండ్‌కు 500 మీటర్ల దూరంలోనే నిరాశ్రయ ఆశ్రమాలుండాలని, దూరప్రాంతాలకు తరలిస్తే ఆశ్రయం పొందేవారికి రక్షణ, వైద్య సదుపాయాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మెప్మా ఎండీ కేంద్రాలను తరలించవద్దని, ఒకవేళ తరలిస్తే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోనాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గవర కార్పొరేషన్ సభ్యులుగా నలుగురి నియామకం


పి.అజయ్‌బాబు


:పి.శ్రీనివాసరావు


బి.లక్ష్మీనారాయణ


బి.గోపికృష్ణ

కంచరపాలెం/మర్రిపాలెం,/అల్లిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర కార్పొరేషన్ సభ్యులుగా 57వవార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, మర్రిపాలేనికి చెందిన పొలమరశెట్టి శ్రీనివాసరావులను ప్రభుత్వం నియమించింది. టీడీపీ కేంద్ర కమిటీ వీరికి నియామక పత్రాలు పంపింది. టీడీపీలో ఉంటూ సుదీర్ఘకాలంగా వీరు ఆయా ప్రాంత ప్రజలకు సేవలందిస్తున్నారు. తమకు అవకాశమిచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబులకు వీరు వేర్వేరుగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే దక్షిణ నియోజకవర్గంలోని అల్లిపురం 33వ వార్డుకు చెందిన జనసేన నాయకుడు బీశెట్టి గోపీకృష్ణ, 32వ వార్డు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధా లక్ష్మీనారాయణలను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. గవర సామాజిక వర్గం అభ్యున్నతికి తమవంతు కృషి చేస్తామని వీరు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ఉద్యానవనంగా డంపింగ్ యార్డు

... 5వ పేజీ తరువాయి

'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంటును పీపీపీ విధానంలో జిందాల్ కంపెనీ ఏర్పాటుచేసింది. నగరంలో ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న 1100 టన్నుల చెత్తలో దాదాపు 750 టన్నుల తడి చెత్తను ఎనర్జీ ప్లాంట్‌కు తరలించేస్తున్నారు. ఇక పొడి చెత్తలో ప్లాస్టిక్‌ను వేరుచేసి ప్లాస్టిక్ పిల్లెట్‌ల తయారీకి, పేపర్ వేస్ట్‌ను అట్టల తయారీకి, గాజు వ్యర్థాలను గాజు వస్తువులు తయారీకి ముడి సరకు తయారుచేసే యూనిట్లకు, డెబ్రిస్‌ను యార్డులోనే ఉన్న బ్రిక్ తయారీ యూనిట్‌కు అందజేస్తున్నారు. దీని వల్ల ప్రస్తుతం ఏరోజు చెత్త అదేరోజు వివిధ రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా శాస్త్రీయ పద్ధతిలో పునర్వినియోగం అయిపోతోంది. ఎటొచ్చీ లెగసీ వేస్ట్ (గతంలో యార్డులో పేరుకుపోయిన చెత్త)తోనే సమస్య. దానిని జిగ్మా ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ బయో మైనింగ్ చేస్తోంది. లెగసీ వేస్ట్‌ను 'బయో రెమిడేషన్' పద్ధతిలో యంత్రాలతో తవ్వి తీసి అందులోని ప్లాస్టిక్, గాజు, కాగితం, డెబ్రిస్ (కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్) వ్యర్థాలను వేరుచేస్తున్నారు. ఆ తర్వాత ప్లాస్టిక్, గాజు వ్యర్థాలను యార్డులోనే ఏర్పాటుచేసిన సంబంధిత యూనిట్లకు తరలించి వాతావరణానికి ఇబ్బంది తలెత్తకుండా కరిగించేసి పునర్వినియోగానికి అనుగుణంగా మార్చుతున్నారు. అలాగే యార్డులోని భవన నిర్మాణ వ్యర్థాలను సీ అండ్‌డీ యూనిట్ ద్వారా సిమెంట్ బ్రిక్, టైల్స్ తయారుచేస్తున్నారు. ఇప్పటివరకూ 9.5 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను రీసైక్లింగ్ చేయడంతో 33 ఎకరాలు ఖాళీ అయింది.

యార్డులో పేరుకుపోయిన లెగసీ వేస్ట్‌ను వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించిన నేపథ్యంలో గతంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన అనుభవంతో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ కాపులుప్పాడ యార్డును పూర్తిగా ఖాళీ చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. దీనిని అమలు చేసే క్రమంలో ఇటీవల ఆయన కాపులుప్పాడ యార్డును సందర్శించారు. అక్కడ ప్రస్తుతం ఉన్న రీసైక్లింగ్ యూనిట్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని ప్రతినిధులను ఆదేశించారు. వచ్చే ఏడాది అక్టోబరు రెండో తేదీ నాటికి యార్డులో ఉన్న లెగసీ వేస్ట్ మొత్తాన్ని ఖాళీ చేయాలనే లక్ష్యంతో కొత్తగా మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ (ఎంఆర్‌ఎఫ్) యూనిట్ ఏర్పాటుపనులను వేగవంతం చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. యూనిట్ అందుబాటులోకి వస్తే లెగసీ వేస్ట్‌లోని ప్లాస్టిక్, క్లాత్, పేపర్ వంటి వ్యర్థాలను వేరుచేసి వాటిని రీసైక్లింగ్‌కు అవసరమయ్యే ముడిసరకుగా తయారుచేసి ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలకు సరఫరా చేస్తారు. అలాగే బయో సీఎన్‌జీ గ్యాస్ ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించడంతో ఆ యూనిట్‌కు ప్రతిరోజూ 20 టన్నులు తడిచెత్తను అందజేస్తున్నారు.

చెత్త యార్డును ఉద్యానవనంగా తీర్చిదిద్దుతాం

కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని లెగసీ వేస్ట్‌ను వచ్చే ఏడాది అక్టోబరు రెండు నాటికి పూర్తిగా ఖాళీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఖాళీ అయిన యార్డులో మొక్కలు నాటి ఉద్యానవనంగా మార్చుతాం. యార్డులో ఏళ్ల తరబడి చెత్త పేరుకుపోయి ఉండడంతో భూమిలోకి ప్రమాదకరమైన రసాయనాలు చేరి ఉంటాయి. కాబట్టి ఆ భూమిలో కనీసం 15 సంవత్సరాల పాటు గ్రీన్ బెల్ట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం యార్డులో 9.5 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను ఖాళీ చేయడంతో 33 ఎకరాల భూమి అందుబాటులోకి వచ్చింది. ఆ భూమిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

-పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్

మెట్రో ప్రాజెక్టుపై వాడీవేడిగా..

... 5వ పేజీ తరువాయి

నిరిస్తారా?, విడిగా నిర్మిస్తారా?...వివరించాలని కోరారు.

కేంద్రం నుంచి అనుమతి రాగానే ముందుకు వెళతాం: పి.నారాయణ, మంత్రి

ఈ అంశంపై పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. విశాఖ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర రవాణా ప్రణాళిక కేంద్రానికి సమర్పించామని, అనుమతి రాగానే ముందుకు వెళతామని చెప్పారు. గాజువాక నుంచి కొమ్మాది వరకు 42.5 కి.మీ. పొడవున మూడు కారిడార్ల నిర్మాణానికి డీపీఆర్ తయారుచేసి నాటి టీడీపీ ప్రభుత్వం కేంద్రానికి పంపిందన్నారు. టెండర్లు పిలవగా కొన్ని కంపెనీలు బిడ్లు కూడా వేశాయన్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టెండర్లు రద్దు చేసి కారిడార్‌ను భోగాపురం విమానాశ్రయం వరకూ పొడిగించిందని, దాంతో కేంద్రం దానిని పక్కన పెట్టేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆ తరువాత ముందుకు వెళ్లలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కోల్‌కతా మెట్రో రైలు తరహాలో వంద శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చేలా, రైల్వే శాఖకు ప్రాజెక్టు అప్పగించేలా ప్రతిపాదనలు కేంద్రానికి పంపించామన్నారు. రెండు దశల్లో నాలుగు కారిడార్లు నిర్మిస్తామన్నారు.

మొదటి దశలో 46.23 కి.మీ. పొడవున మూడు కారిడార్లు వస్తాయన్నారు. మొదటి కారిడార్ స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకూ 34.4. కి.మీ., రెండో కారిడార్ గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.07 కి.మీ., మూడో కారిడార్ తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు 6.75 కి.మీ. ఉంటుందన్నారు. దీనికి రూ.11,498 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశామన్నారు. రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు 30.67 కి.మీ., 12 స్టేషన్లతో మెట్రో నిర్మాణానికి ప్రతిపాదన చేశామన్నారు. మెట్రో కారిడార్ వెళ్లే మార్గంలో ఎక్కువ క్రాసింగ్స్ ఉన్నందున ప్రతి క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా కార్‌షెడ్డు, ఎండాడ, హనుమంతవాక, మద్దిలపాలెం, విప్రో, గురుద్వారా, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, గాజువాక, స్టీల్‌ప్లాంటు జంక్షన్ల వద్ద టూ లెవెల్ మెట్రో, ఫ్లైఓవర్లు నిర్మించాలని ప్రతిపాదించినట్టు వివరించారు.

మహా మేత

... 5వ పేజీ తరువాయి

తాత్కాలిక కార్మికులకు కాంట్రాక్టర్ ద్వారా సక్రమంగా వేతనాలు అందడం లేదని, అందువల్ల యూసీడీ పరిధిలో కొన్ని ఎస్‌ఎల్‌ఎఫ్‌లను ఎంపిక చేసి వాటి ద్వారా చెల్లించాలని సూచించారు. పాలక వర్గంలో కీలక నేత కావడంతో ఈ ప్రతిపాదనను అధికారులు ఆగమేఘాలపై అమలుచేశారు. యూసీడీ అధికారులు సదరు నేత సూచించిన ఎస్‌ఎల్‌ఎఫ్‌లను జోన్‌ల వారీగా ఎంపిక చేసి వారి ఖాతాల్లో కార్మికుల వేతనాలు జమ చేయడం ప్రారంభించారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులు 790 మందికి కూడా ఎస్‌ఎల్‌ఎఫ్‌ల ద్వారానే వేతనాలు చెల్లించేలా ఆ విభాగం అధికారులపైనా ఒత్తిడి చేశారు.

నెలకు రూ.3.23 లక్షలు మినహాయింపు

మలేరియా విభాగంలో 406 మంది, పారిశుధ్య విభాగంలో 790 మంది తాత్కాలిక కార్మికులకు రోజుకు రూ.450 చొప్పున జీవీఎంసీ చెల్లిస్తోంది. ఈ మొత్తం రూ.1,61,46,000 ఎస్‌ఎల్‌ఎఫ్‌ల ఖాతాలకు జమ చేస్తోంది. వేతనాలను చెల్లిస్తున్నందుకు గానూ ఎస్‌ఎల్‌ఎఫ్‌లు సర్వీస్ చార్జీ కింద రెండు శాతం మినహాయించుకుంటున్నాయి. అంటే నెలకు సుమారు రూ.3.23 లక్షలు. ఆ మొత్తాన్ని తమ పరిధిలోని మహిళా సంఘాలకు పంచాలి. ఇదికాకుండా కార్మికుల వేతనాలను జీవీఎంసీ నుంచి తీసుకుని కార్మికులకు అందజేసే క్రమంలో భారీగా లావాదేవీలు జరుగుతుంటాయి కాబట్టి రెండు శాతం మొత్తాన్ని ఐటీ కింద మినహాయించారు. కార్మికులు ఐటీ రిటర్న్స్ లేదా ఐటీ శాఖ నుంచి ప్రత్యేక అనుమతితో ఆ మొత్తాన్ని తిరిగి పొందే వీలుంటుంది. సంబంధిత పత్రాన్ని ఎస్‌ఎల్‌ఎఫ్‌లకు అందజేస్తే వారు ఐటీ శాఖకు పంపి, మినహాయించిన మొత్తాన్ని తిరిగి పొందడం ద్వారా కార్మికులకు ఇవ్వాలి. కానీ కార్మికులకు ఐటీ రిటర్న్స్‌పై అవగాహన ఉండదు కాబట్టి ఎస్‌ఎల్‌ఎఫ్‌లు తమ ఖాతాలోనే ఆ మొత్తాన్ని ఉంచుకుంటున్నాయి. సర్వీస్ చార్జీ కింద మినహాయిస్తున్న మొత్తంలో ఎస్‌ఎల్‌ఎఫ్‌ల అధ్యక్ష, కార్యదర్శులకు కొంత, మిగిలిన మొత్తాన్ని వైసీపీ నేత జేబులో వేసుకుంటున్నారని కూటమి కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం లేవనెత్తడంతో సభలో వాదోపవాదాలు జరిగాయి. తాజాగా కొంతమంది స్టాండింగ్ కమిటీ సభ్యులు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించడంతో పాటు కార్మికులకు వేతనాలు ఇస్తున్న ఎస్‌ఎల్‌ఎఫ్‌లను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా జడ్జి ధోరణిని నిరసిస్తూ న్యాయవాదుల విధుల బహిష్కరణ

18 నుంచి 20 వరకూ ప్రధాన న్యాయస్థానానికి వెళ్లబోమని ప్రకటన

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):జిల్లా ప్రధాన న్యాయమూర్తి ధోరణిని నిరసిస్తూ మూడు రోజుల పాటు ప్రధాన న్యాయస్థానానికి వెళ్లకూడదని న్యాయవాదుల సంఘం నిర్ణయించింది. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం న్యాయవాదులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ జిల్లా ప్రధాన న్యాయస్థానాన్ని బహిష్కరించనున్నట్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ వెల్లడించారు. దీనిపై ఇప్పటికే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్టు వారు పేర్కొన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ మాట్లాడుతూ విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించినందున ఇక్కడ హైకోర్టు బెంచ్ కూడా ఏర్పాటుచేయాలన్నారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి నరేశ్‌తో పాటు సీనియర్ న్యాయవాది కర్రి ఆదిబాబు, పెద్ద సంఖ్యలో నాయవాదులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఒక్కరోజే రూ.16 లక్షల ఆస్తి పన్ను వసూలు

జ్ఞానాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని 28, 31 వార్డులలో బుధవారం ఒక్కరోజే రూ.16 లక్షల ఆస్తిపన్ను వసూలు చేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన చెక్కును జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు అందజేశారు. ఆర్‌ఓ అప్పలరాజు, ఆర్‌ఐలు సీతారాం, ఉదయ్‌భాస్కర్, వార్డు అడ్మిన్ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ పాఠశాలలపై సానుకూలంగా వ్యవహరించాలి'

దొండపర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంటిమహంతి ప్రవీణ్ కోరారు. దొండపర్తిలో బుధవారం జరిగిన చిన్న పాఠశాలల కరస్పాండెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ తర్వాత ప్రైవేట్ విద్యా వ్యవస్థ దారుణంగా పతనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అప్రజాస్వామిక నిబంధనలు పెడుతూ, పాటించకపోతే చర్యలు తీసుకుంటామని బెదిరించడంతో తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సుదర్శన్, కార్యదర్శి పీవీవీ వరప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు, నాయకులు ఎస్‌కే రత్నం, వరలక్ష్మి, సీహెచ్ మాధవి, అనంత లక్ష్మి, వి.మహేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాప అపహరణకు యత్నం!

... 5వ పేజీ తరువాయి

కుమార్తెను గట్టిగా పట్టుకుని వదలకపోవడంతో పాపను అపహరించేందుకు వచ్చిన మహిళలు బ్లేడ్‌తో పద్మ మెడపై గాయపర్చారు. ఆమె చేతిపై కూడా గాయమైంది. ఈ సమయంలో పద్మ పెద్దగా కేకలు వేయడంతో ఇద్దరు మహిళలు వాహనంపై పరారయ్యారు. వారిద్దరూ రెండు రోజుల నుంచి ఇదే మార్గంలో తిరుగుతున్నారని, మంగళవారం రాత్రి మాత్రం నేరుగా ఇంటికి వచ్చి పాపను అపహరించేందుకు యత్నించారని పద్మ తెలిపింది. దీనిపై గాజువాక పోలీసులకు పద్మ సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆదాయం రూ. 39.28 లక్షలు


కానుకలు లెక్కిస్తున్న దేవాలయ అధికారులు, సిబ్బంది

జగదాంబ కూడలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల్లో కానుకల లెక్కింపు బుధవారం ఆలయ ప్రాంగణంలో దేవస్థానం అధికారులు చేపట్టారు. భక్తులు సమర్పించిన 63 రోజుల (11-9-24 నుంచి 13-11-24) కానుకల ఆదాయం రూ.39.28 లక్షలు, బంగారం 52 గ్రాములు, వెండి 123 గ్రాములు విదేశీ కరెన్సీ వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఈవో కె.తిరుమలేశ్వరరావు, ఎస్.వరప్రసాద్, యూనియన్ బ్యాంక్ మేనేజరు జి.రామకృష్ణ, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపండి: ఆర్డీవో

మహరాణిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపుతూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ సూచించారు. బుధవారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో సబ్‌డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు, ఇందులో భాగంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేసి, బాధితులకు నిర్ణీత సమయంలో నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. పథకాలు ఎస్సీ ఎస్టీలకు చేరువ చేస్తూ, అన్ని విధాలా అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో నగర పరిధిలోని ఏసీపీలు, తహసీలార్లు, జీవీఎంసీ, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి సన్నాహాలు


శిథిలమైన కర్రివారి వంతెనను పరిశీలిస్తున్న టీడీపీ నేత బొడ్డేటి మోహన్, అధికారులు

అక్కయ్యపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డులోని కర్రివారి వంతెన శిథిల స్థితికి చేరుకోవడంతో దాని స్థానంలో రూ.53 లక్షలతో కొత్తది నిర్మించడానికి జీవీఎంసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహనరావు, ఏఈ రమణమ్మ, విద్యుత్ శాఖ ఏఈ బుధవారం వంతెనను పరిశీలించారు. దీన్ని కూల్చేసి జీవీఎంసీ నిధులతో కొత్తగా నిర్మించేందుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఏఈ రమణమ్మ తెలిపారు.

కేజీహెచ్ ఏడీగా అప్పారావు


అప్పారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

మహరాణిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పి.ఎన్. అప్పారావు నియమితులయ్యారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కేజీహెచ్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు, ల్యాబ్ టెక్నీషియన్ సంఘ ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రామ్‌ప్రసాద్, బి.వి.ఎస్. ప్రసాద్, నాగు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ


మహిళలకు వస్త్రాలు అందిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్ తదితరులు

అక్కయ్యపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల సమయంలో 46వ వార్డుకు చెందిన పారిశుధ్య కార్మికులు అక్కడ విశేష సేవలందించడం ఎంతో ఆనందదాయకమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. ఈ మేరకు బుధవారం వారికి శాంతినగర్‌లోని వార్డు కార్యాలయలో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి పని చేసే పారిశుధ్య కార్మికుల సేవలను ఎంత కీర్తించినా తక్కువేనన్నారు. కరోనా సమయంలో వారు అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని ఆయన స్పందించారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యం, అప్పారావు, సోమునాయుడు, సచివాలయం కార్యదర్శి సత్యం, వార్డు సూపర్‌వైజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

విమాన భద్రతపై సదస్సు



కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం అధికారులు విమాన భద్రతపై మంగళ, బుధవారాల్లో వార్షిక సదస్సును నిర్వహించారు. ఐఎన్ఎస్ డేగాలో జరిగిన సదస్సుకు తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నేవీ ఎయిర్ ఆపరేషన్లకు ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలు చర్చించారు. మానవ రహిత విమానాలు, సైబర్ సెక్యూరిటీ, సునిశిత శిక్షణ వంటి అంశాలను అధ్యయనం చేయాలని నిర్ణయించారు. దీనికి ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, కోస్టుగార్డుల ప్రతినిధులు హాజరయ్యారు.

గవర కార్పొరేషన్ సభ్యుడిగా మళ్ల రవికుమార్



వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం సాయంత్రం నియమించిన వివిధ కార్పొరేషన్ల సభ్యులలో గవర కార్పొరేషన్ సభ్యుడిగా విశాఖ తూర్పు 15వ వార్డు పాత వెంకోజీపాలేనికి చెందిన మళ్ల రవికుమార్‌కు చోటు దక్కింది. తొలి నుంచి టీడీపీకి విధేయుడైన రవికుమార్ పాత వెంకోజీపాలెం శ్రీసీతారామ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు. ప్రస్తుత ఆడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘంలో సహాయ కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తూ అనేక గవర కులస్తుల సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. అలాగే 15వ వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శిగా గత 7 ఏళ్లుగా వార్డులో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

పెదగదిలి శివాలయంలో క్షీరాబ్ది ద్వాదశ పూజలు

ఆరిలోవ, నవంబరు 13 : ఆరిలోవలో గల పలు శివాలయాల్లో బుధవారం క్షీరాబ్ధి ద్వాదశ పూజా మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరిలోవ గల బాలాత్రిపుర సుందరీ సహిత మల్లేశ్వరస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు వచ్చి కీరాబ్ది ద్వాదశ పూజల్లో పాల్గొన్నారు. పురోహితులు, అర్చకులకు ధాన్య, వస్త్రదానాలు తదితరాలు చేశారు. పెదగదిలిలో గల కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళలు పలు దానాలు సమర్పించారు.

సినిమా గైడ్

● **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడీ, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)

● **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)

● **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)

● **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

● **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)

● **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 26, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 32, క్యారెట్ 54 దొండకాయలు 32, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)55, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోసకాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరి కాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 62, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, క్యాప్సికమ్ 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	97
ఫారం ధర	117
విత్ స్కిన్	204
స్కిన్‌లెస్	214

ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల కమిటీ ఏయూ సందర్శన



కమిటీ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఏర్పాటు చేసిన ఎన్ఐఆర్ఎఫ్ నిపుణుల కమిటీ బృందం బుధవారం ఏయూను సందర్శించింది. ముందుగా పాలకమండలి సమావేశం మందిరంలో ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావు, ఇతర అధికారులతో కమిటీ సభ్యులు ఆచార్య జుబైదా అన్సారీ, డాక్టర్ రమా కొండపల్లి, డాక్టర్ ప్రశాంత్ ఆర్ నాయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య గిరిజా శంకర్ ఏయూ ఐక్యూ ఏసీ కేంద్రం పని చేస్తున్న విధానం తదితర అంశాలను వివరించారు.

అనంతరం కమిటీ ప్రతినిధులు ఏయూ కళాశాల ప్రిన్సిపాల్, ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ కమిటీ, టాస్క్‌ఫోర్స్ కమిటీలతో సమావేశం అయ్యారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌కు ఏయూ అనుసరిస్తున్న విధానం తదితర అంశాలను వీరికి ఆచార్య గిరిజా శంకర్ వివరించారు. తదుపరి ఏయూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇన్నోవేషన్ సెంటర్, నానో టెక్నాలజీ సెంటర్, నార్త్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ సెల్, అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఫుడ్ డ్రగ్ టెస్టింగ్ లేబరేటరీ, అమెరికన్ కార్నర్, అల్యూమ్ని అసోసియేషన్ ఆఫీస్, డీన్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ ఆఫీస్, సౌత్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ కార్యాలయం, డాక్టర్ వీఎస్ కృష్ణా సెంట్రల్ లైబ్రరీలను సందర్శించారు. కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులం విద్యార్థికి అస్వస్థత

» కేజీహెచ్‌లో చికిత్స

» ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు



విద్యార్థికి విమ్స్ నుంచి కేజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం

ఆరిలోవ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారం సమీపంలో గల శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులంలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి అస్వస్థకు గురయ్యాడు. గురుకులం సిబ్బంది సకాలంలో స్పందించి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

శ్రీకృష్ణాపురంలోని అంబేడ్కర్ గురుకులంలో ఆరో తరగతి చదువుతున్న రవీంద్రకుమార్ బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో పాఠశాల సిబ్బంది అతడిని శ్రీకృష్ణాపురంలో గల ప్రాథమిక వైద్య కేంద్రానికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి 'విమ్స్'కు తీసుకెళ్లమని చెప్పారు. వెంటనే ప్రిన్సిపాల్ రత్నవల్లి స్పందించి విమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు జ్వరం ఎక్కువగా ఉందని, ఫిట్స్ వస్తున్న లక్షణాలు కనిపిస్తున్నాయని పేర్కొంటూ కేజీహెచ్‌కు తీసుకెళ్లాలని సలహా ఇచ్చారు. వెంటనే విమ్స్ అంబులెన్స్‌లో రవీంద్రకుమార్‌ను కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందేలా చూశారు. గురుకులం కో-ఆర్డినేటర్ రూపవతి కేజీహెచ్‌కు వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతం రవీంద్రకుమార్‌కు ప్రమాదం ఏమీ లేదని, ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపినట్టు చెప్పారు.

కాగా, కొంతమంది గురుకులంలో 70 మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత నెలకొందంటూ సెల్‌ఫోన్లలో సందేశాలు పంపారని, అయితే అటువంటిదేమీ లేదని రూపవతి తెలిపారు. సుమారు 17 మంది విద్యార్థులు దురదలు, బాడీ పెయిన్స్‌తో బాధపడుతున్నారని చెప్పారు. వారందరికీ వైద్యం అందిస్తున్నట్టు ఆమె వెల్లడించారు. గురుకులంలో విద్యార్థులందరిక ఆరోగ్యం బాగా ఉందని, ఎలాంటి ఆందోళన వద్దని ఆమె కోరారు.

ఘనంగా గ్రంథాలయాల వారోత్సవాలు నిర్వహించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు పిలుపునిచ్చారు. కళాశాలలో బుధవారం ఆయనవారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ గ్రంథాలయ పితమహుడు ఎస్ఆర్ రంగనాథన్ గుర్తుగా ప్రతి ఏటా గ్రంథాలయ జాతీయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు కళాశాలలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు శ్రావణ్‌కుమార్, ఎస్వీ రామారావు, పి.ధనలక్ష్మి, వై.శాంతిప్రభ, పోల ఉమామహేశ్వరరావు, విజయప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర కారాగారం వద్ద పెట్రోల్ బంకు ఏర్పాటుపై చర్చలు

» ఐవోసీ, జైలు అధికారుల సమావేశం

ఆరిలోవ, నవంబరు 13 : (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్ర కారాగారంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రతినిధులతో జైలు సూపరింటెండెంట్ కిశోర్, శ్రీకాకుళం జైలు సూపరింటెండెంట్ సన్యాసిరావు, ఏవోసీ రీజనల్ మేనేజర్ ప్రశాంత్ సమావేశమయ్యారు. కేంద్ర కారాగారానికి సమీపంలో గల స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు 2015లో అప్పుడు ఇక్కడ డెప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉన్న సన్యాసిరావు పలుమార్లు సంప్రదింపులు జరిపారు. జీవీఎంసీ నుంచి అనుమతి కూడా లభించింది. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో బంకు ఏర్పాటుకు అనుమతి రాలేదు. దీంతో పెట్రోల్ బంకు ఏర్పాటు అంతటితో ఆగిపోయింది.

తాజాగా.. జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రస్తుతం శ్రీకాకుళం జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న సన్యాసిరావుకు ఆ బాధ్యతలు అప్పగించారు.

ఈ నేపథ్యంలో బుధవారం ఐవోసీ ప్రతినిధులు, జైలు శాఖ అధికారులు సమావేశమయ్యారు. గురువారం కూడా చర్చలు జరపనున్నట్టు వారు తెలిపారు. వీరి చర్చయలు ఫలిస్తే కేంద్ర కారాగారం సమీపంలో పెట్రోల్ బంకు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంటుంది.

తత్త్వశాస్త్ర విద్యార్థులది గురుతర బాధ్యత



విద్యార్థులకు సందేశాన్ని ఇస్తున్న బౌద్ధ భిక్షువు పూంటశ్వక్

వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏయూ తత్త్వ శాస్త్ర విభాగంలో టిబెట్‌కు చెందిన బౌద్ధ భిక్షువు పూంటశ్వక్ బుధవారం సందర్శించి అధ్యాపకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దుఃఖ నుంచి విముక్తిని పొందే మార్గాన్ని ప్రజలకు తెలియజేయడం తత్త్వశాస్త్ర విద్యార్థుల గురుతర బాధ్యత అన్నారు. బౌద్ధ ధర్మం మానవున్ని దుఃఖ విముక్తున్ని చేస్తుందన్నారు. కోరికలను పరిమితంగా ఉంచడం ద్వారా మానవ జీవితానికి దుఃఖ విముక్తి లభిస్తుందని, తద్వారా మానవుడు మోక్షం పొందగలడని పేర్కొన్నారు. బౌద్ధమతం ప్రకారం నాలుగు మహాసత్యాలు ఉన్నాయని, ఈ ప్రపంచం దుఃఖంతో నిండిందని, దుఃఖానికి కారణం కోరిక, కోరికను జయించడం ద్వారా దుఃఖాన్ని జయించవచ్చునని, కోరికను జయించడానికి ఆర్య అష్టాంగ మార్గం అనుసరించాలని చెప్పారు. ఈ మార్గాన్ని అనుసరించే వారు ప్రశాంత జీవితం గడపవచ్చని, ఈ మార్గం మన ఆత్మీయ సామర్థ్యాన్ని తెలుసుకోవడంలో సహాయపడుతుందన్నారు. ఈ మార్గాన్ని అనుసరించడం ద్వారా కోపం, అసూయ, లోభం వంటి నైజాలు దాటవచ్చన్నారు. ఈ మార్గం మన మనసుకు స్పష్టతనూ, దూరదృష్టిని పెంపొందిస్తుందని, ప్రశాంత స్థితిని అందిస్తుందని, ఇంకా మనలోని అవగాహనను మెరుగుపరుస్తుందని, చివరికి ఈ మార్గం మానవుడు నిర్వాణాన్ని సాధించటానికి సహాయపడుతుందని వివరించారు. కార్యక్రమంలో తత్త్వ విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు



కార్యక్రమంలో పాల్గొన్న వెంకటశేషమ్మ, వైద్యులు, పాఠశాల సిబ్బంది

పెదవాల్తేరు, నవంబరు 13 : మానసిక దివ్యాంగ బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ వెంకటశేషమ్మ సూచించారు. బుధవారం పెదవాల్తేరు సన్‌ఫ్లవర్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సంస్థలో చదువుతున్న మూగ, చెముడు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మానసిక శారీరక, ఈఎన్టీ సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చినవాల్తేరు ముఖ్యమంత్రి ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ శ్రీరమ్య డాక్టర్ ప్రదీప్, డాక్టర్ స్వేతారావు, సన్‌ఫ్లవర్ సంస్థల ప్రిన్సిపాల్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలతో విద్యార్థుల మాటామంతీ



వృద్ధులతో మాట్లాడుతున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మానవ సేవే, మాధవ సేవ అని పిలుపునిచ్చిన సత్యసాయిబాబా దివ్య సందేశాన్ని అమలు చేయడంలో భాగంగా సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో బుధవారం పలు సేవలను అందించారు. సత్యసాయి 99వ జన్మదినోత్సవాల్లో భాగంగా వానప్రస్థ ఆశ్రమం, వైజాగ్ ఓల్డ్ ఏజ్ హోంలలో పదో తరగతి విద్యార్థులు అక్కడి అవ్వాతాతలతో ఆప్యాయంగా పలకరించి మాట్లాడారు. వారికి నిత్యావసర సరుకులు, దుస్తులు, పండ్లు, పారిశుధ్య సామగ్రి అందించారు. విద్యార్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

విమానాశ్రయానికి కొత్త రాడార్



విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం నిఘా కోసం కొత్త రాడార్‌ను ఏర్పాటు చేశారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూపొందించిన ఈ అధునాతన రాడార్‌ను డాల్ఫిన్స్ నోస్ కొండపై పెట్టారు. విమానాశ్రయం పరిసరాల్లో గగనతలంపై విమానాల రాకపోకలకు సంబంధించిన సమాచారం నిరంతరం దీని నుంచి అధికారులకు అందుతుంది. ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు ఇది ఎంతగానో దోహద పడుతుందని ఐఎన్ఎస్ డేగా అధికారులు పేర్కొన్నారు. ఈ రాడార్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందిస్తున్న కార్పొరేటరు మంగవేణి

ఎంవీపీ కాలనీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విజయవాడ వరద ప్రాంతాల్లో పారిశుధ్య సేవలను అందించిన జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణిపోలారావు బుధవారం ఆమె నివాసం వద్ద సన్మానించారు. జీవీఎంసీ అందించిన వస్త్రాలను సిబ్బందికి ఇచ్చారు. నాటి విలయంలో ప్రశంసనీయమైన సేవలు అందించారని, పారిశుధ్య సిబ్బంది సేవల వల్ల వరద ప్రాంతాలు త్వరగా కోలుకున్నాయని అన్నారు.

వెంకోజీపాలెంలో..



వస్త్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య

వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డు పారిశుధ్య కార్మికులకు వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య నూతన దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విడయవాడ ప్రజలు కష్ట సమయంలో వున్నపుడు ముంపునకు గురైన ప్రాంతాలలో సేవలు అందించిన శానిటరీ సిబ్బంది అభినందనీయమన్నారు. ప్రభుత్వం కూడా వీరి సేవలు గుర్తించిందన్నారు. ఎప్పటికప్పుడు వార్డుల్లోని చెత్తను తొలగిస్తూ శుభ్రంగా తీర్చిదిద్దడంలో కార్మికులు చేస్తున్న సేవ ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పారి వెంకట గిరిబాబు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌కుమార్, మేస్త్రి రమణ, శ్రీను పాల్గొన్నారు.

24 గంటల్లో దొంగల్ని పట్టేశారు

» మల్కాపురం, పెందుర్తి పోలీసులకు ఉన్నతాధికారులు అభినందనలు

పెందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల జరిగిన చోరీల కేసుల్లో 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్న పెందుర్తి, మల్కాపురం పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు. పెందుర్తి కేసుకు సంబంధించి ఎస్ఐ డి. సూరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం..

ఆర్ఆర్‌వీ పురం పవర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న క్రిష్టి చికెన్ రెస్టారెంట్‌లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రెస్టారెంట్‌కు చెందిన సీసీ కెమెరాల వైర్లను కత్తిరించి, షట్టర్ల తాళాలు పగలు కొట్టి నిందితుడు లోపలికి ప్రవేశించాడు. రెస్టారెంట్‌లో ఉన్న ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీ, బిల్లింగ్ మానిటర్, ప్రింటర్ చోరీ చేశాడు. ఉదయం రెస్టారెంట్‌కు వచ్చిన సిబ్బంది షట్టర్ తెరిచి ఉండడంతో విషయాన్ని నిర్వాహకుడు పోతురాజుకు చెప్పగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సూరిబాబు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సీసీ కెమెరాల్లో సరైన ఆధారాలు లభించకపోవడంతో షట్టర్ చోరీలో ఆరితేరిన దొంగలపై నిఘా పెట్టారు, ఈమేరకు అక్కయ్యపాలెంకు చెందిన పాత నేరస్థుడు గోడాది హరి సంపత్ (26) అలి యాస్ హరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు, చోరీ జరిగిన 24 గంటల్లోనే నింది తుడ్ని పట్టుకున్న ఎస్ఐ సూరిబాబు, హెచ్‌సీలు నాగరాజు, ఎంఎస్ నాయుడు, శివప్రసాద్, దేవుడు నాయుడును ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు అభినందించారు

శ్రీహరిపురం ఎంఐజీ క్వార్టర్స్‌లో...

మల్కాపురం : శ్రీహరిపురం ఎంఐజీ క్వార్టర్స్‌లో చోరీకి పాల్పడిన దొంగను మల్కాపురం పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. ఏడీసీపీ మోహన్‌రావు, క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివ రాలు ప్రకారం.. క్వార్టర్స్‌లో నేవీ రిటైర్డ్ అధికారి ప్రసాద్ సింగ్ నివాసం ఉంటున్నారు. ఈనెల 4న కుటుంబంతో కలిసి టూర్‌కు వెళ్లారు, తిరిగి 11న వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళాలు పగలుగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి, ఇంట్లోకి వెళ్లి చూడగా 18 తులాల బంగారం, రూ. 1.50 లక్ష నగదు చోరీ అయినట్టు గుర్తించి, మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, సీసీ కెమెరా ఆధారంగా దొంగను పట్టుకున్నారు.

రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన దాసరి వరహహరి (47) శ్రీహరిపురం ప్రాంతానికి వచ్చి ఆటోలో పాలు రవాణా చేస్తూ జీవనం కొనసాగిస్తూనే దొంగతనాలు కూడా చేస్తుండేవాడు. అందులో భాగంగా 4న ఎంఐజీ క్వార్టర్స్‌లో ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గుర్తించి 6వ తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో చోరీకి పాల్పడ్డాడు. పోలీసులు 4వ తేదీ నుంచి 11 వరకు ఈ మార్గం మీదుగా రాత్రి వేళ ఎవరెవరు తిరిగారన్నది సీసీ కెమెరాల ఆధారంగా పరిశీలించగా హరి ఎక్కువగా తిరగడం గుర్తించి, అదుపులోకి తీసుకుని విచారించగా, నేరం అంగీకరించాడు. 24 గంట్లో కేసును చేధించిన ఎస్ఐ రమణను, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

కల్తీ ఆహారం ప్రధాన సమస్యగా గుర్తించాలి

» జనజాగరణ సమితి ఆందోళన



తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జనజాగరణ సమితి నాయకులు

మద్దిలపాలెం, నవంబరు 13 : రాష్ట్ర ప్రభుత్వం కల్తీ ఆహారాన్ని ప్రధాన సమస్యగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద జనజాగరణ సమితి నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు మాట్లాడుతూ కల్తీ ఆహారాన్ని ప్రధాన సమస్యగా గుర్తించి అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. కల్తీ ఆహారం తినడం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కల్తీ ఆహారం విక్రయించే వారు ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమని పేర్కొన్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారని, అలాంటి వారిని విధుల నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జన జాగరణ సమితి నాయకులు సునీల్‌కుమార్, దేవర శంకర్, సంజయ్, కృష్ణ కౌశిక్‌పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరల నియంత్రించాలి



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం, నవంబరు 13 : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక పిఠాపురం కాలనీ సచివాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మద్దిలపాలెం జోన్ కమిటీ సభ్యుడు పెంటకోట వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. వంట నూనె లీటరుపై ఏకంగా రూ.50 పెరిగిందని ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలపై నియంత్రణ ఎత్తివేయడం వలే ధరలు పెరుగుతున్నాయన్నారు. మరో పక్క సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీల భారం వేస్తున్నారన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్ విలీనం చేయకుండా ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చలపతి, కుమార్‌మంగళం, కుమారి, వెంకటరావు, అప్పారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పోలీసు అరెస్టు



ఆరిలోవ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పోలీసును పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకొని ఆరిలోవ పోలీసుస్టేషన్‌కు తరలించారు.ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన వంతల వెంకటరమణ (33) పోలీసు యూనిఫారం ధరించి జాతీయ రహదారిపై డెయిరీ ఫాం వద్ద సెల్‌ఫోన్లు అమ్మేందుకు యత్నిస్తుండగా, స్థానికులు అనుమానించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీఎం పాలెం క్రైం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు.

కాగా, వంతల వెంకటరమణపై ఇది వరకే పలు సబ్బవరం పీఎస్‌లో పలు కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసుతో కలిసి ఇతడిపై 12 కేసులు ఉన్నట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. తాజా ఘటనపై కేసు నమోదు చేసినదర్యాప్తు చేస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

శ్మశాన అభివృద్ధి పనులు ప్రారంభించండి

» 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



మూర్తియాదవ్‌తో చర్చిస్తున్న జీవీఎంసీ అధికారులు

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులోని శ్మశానం అభివృద్ధికి ఆమోదం పొందిన పనులకు టెండర్లు ఖరారెనాజాప్యం చేయడంపై కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ బుధవారం శ్మశానంలో నిరాహారదీక్ష చేపట్టారు. ప్రహరీ రిపేర్లు, భివృద్ధి పనులకు రూ.56.83 లక్షలతో పనులు చేపట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు పిలిచారన్నారు. ఏడాది గడుస్తున్నా పనులు చేపట్టకపోవడంపై మూడుసార్లు కౌన్సిల్‌లో ప్రస్తావించినా స్పందన లేదన్నారు. తనపై కక్షతో అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు. జోన్-3 కమిషనర్ శివప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు చేరుకుని 45 రోజుల్లో పనులు పూర్తిచేస్తామని హామీ లేఖ అందజేయడంతో దీక్ష విరమించారు.

సంప్రదాయబద్ధంగా క్షీరాబ్ది ద్వాదశి పూజలు

వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆషాడంలో నిద్రలోకి వెళ్లి క్షీరాబ్ధి ద్వాదశి రోజున నిద్ర మేల్కొని విష్ణుమూర్తికి తులసి మాలతో వివాహం చేస్తే సకల పాపాలు హరించుకు పోతాయని భక్తులంతా ఏకాదశి రోజున ఉపవాసం ఉండి, బుధవారం ద్వాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి వద్ద తులసి మొక్కకు పూజలు నిర్వహించి, దీపారాధన చేసి, అనంతరం ఆలయాలకు వెళ్లి బ్రాహ్మణులకు స్వయంపాక, దీపదానం చేశారు. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో అర్చకులు ఆరవెల్లి సూర్య ప్రకాష్ శర్మ, రామకృష్ణ శర్మ, సుబ్రహ్మణ్య శాస్త్రిలు భక్తుల నుంచి స్వయంపాకాలు స్వీకరించి, వారిని ఆశీర్వదించారు.

జీతాలు చెల్లించాలంటూ ధర్నా

సిరిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల బకాయి జీతాలు చెల్లించాలని యూనియన్ గౌరవ అధ్యక్షులు జి.మంగశ్రీ డిమాండ్ చేశారు.బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శానిటేషన్ వర్కర్స్ గడిచిన 10 ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. వీరికి కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వేతనాలు చెల్లించలేదన్నారు. దీంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇప్పుడు ఇస్తున్న రూ.6 వేల వేతనాన్ని పెంచాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు బంగారమ్మ, వసంత, టి.లక్ష్మి, వై.లక్ష్మి, కె.లక్ష్మి, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి అవసరం: ఆర్‌జేడీ

కొమ్మాది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలని విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి. విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పీఎంపాలెం మాలతాంబా విద్యానికేతన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన విశాఖ జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మహంతితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్పోర్ట్స్ మీట్‌లో 300 మంది క్రీడాకారులు పాల్గొనగా రన్నింగ్, త్రోబాల్, షాట్‌పుట్, కోకో, పిరమిడ్స్, యోగాసనాలు, కరాటే, యుద్ధ కళలు వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ఏఓ మధుభట్, పీఎంపాలెం ఎస్ఐ భాస్కర్, ప్రిన్సిపాల్ ఆదిమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, పిడి బి. హరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ద్వాదశి పూజలు

కొమ్మాది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నంరాజునగర్‌లో ఉన్న అష్టలక్ష్మీ దేవాలయంలో క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి తులసి మాలలతో లక్ష్మీనారాయణులకు తోమాలసేవ జరిపారు. అనంతరం 108 మంది దంపతులతో 108 లీటర్ల పాలతో క్షీరాభిషేకం చేశారు. అభిషేకం చేసిన పాలు గర్భాలయంలో ఉంచి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు క్షీర సాగరంలో లక్ష్మీనారాయణుల దర్శనం కల్పించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ

ఆనందపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) 13 : పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధి కారులు భాగస్వాములు కావాలని ఎంపీడీవో డాక్టర్ జానకి చెప్పారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై డ్వాక్రా వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లలకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు ప్రణాళిక తయారు చేసినట్లయితే అందుకు అనుగుణంగా నిధులు సమీకరణ జరుగుతుందన్నారు. ఇందులో స్థానిక ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం పంచాయతీల్లో చేపట్టనున్న పలు అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే 2025-26 సంవత్సరానికి సంబంధించి నిధుల సమీకరణ, ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. శిక్షకులుగా తర్లువాడ, వెల్లంకి పంచాయతీల కార్యదర్శులు ధనుంజయ, శ్రీరామ్మూర్తి, మండల కంప్యూటర్ ఆపరేటర్ మూర్తి వ్యవహరించారు.

ఆనందపురంలో రుద్ర జ్ఞాన యజ్ఞం

ఆనందపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జీఎస్ ఎన్ ఫంక్షన్ హాల్‌లో బ్రహ్మ కుమారీల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రుద్ర జ్ఞాన యజ్ఞం ఘనంగా నిర్వహించారు.ద్వాదశ జ్యోతిర్లంగ దర్శనం అనంతరం ఈ కార్యక్రమాన్ని జరిపారు. కార్యక్రమంలో కోరాడ వెంకటరావు, చందక లక్ష్మి, నాగోతి నాగమణి, కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, కోరాడ అప్పలస్వామి నాయుడు, కోన శ్రీనివాసరావు పైడిరాజు, బంటుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మత్స్యకారుల ధర్నా

భీమునిపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భీమిలి తీర ప్రాంతానికి చెందిన మత్స్యకారులు జోనల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టనున్నట్టు ఎగువపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ జిల్లా మత్స్యకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ ధర్నా జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు ఎగువపేట ముఖద్వారం వద్ద ఊరేగింపు ప్రారంభమై గంటస్తంభం, పాతబస్టాండ్ మీదుగా జోనల్ కార్యాలయం వద్దకు చేరుకుంటుందని, అక్కడ ధర్నా చేసిన అనంతరం రిలే దీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ధర్నాలో మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ముగ్గురు సోషల్ మీడియా యాక్టవిస్టులపై ఫిర్యాదు

ఎండాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ను కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని పీఎంపాలెం పోలీసులకు మూడు ఫిర్యాదులందాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టిన రమణరెడ్డి, హరికృష్ణరెడ్డి, షేక్‌జాన్‌ను తక్షణమే అరెస్టు చేయాలన్నారు.

నిర్లక్ష్యంగా పని చేయొద్దు

- జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్
- జోన్-2 అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సంపత్‌కుమార్

కొమ్మాది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పనితీరు మార్చుకోకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని కమిషనర్ సంపత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన గాయత్రి విద్యా పరిషత్ ఇంజనీరింగ్ కళాశాలలో జోన్-2 అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధురవాడలో అక్రమ, అనధికార నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.త్వరలో అక్రమ నిర్మాణాల నియంత్రణకు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సచివాలయ వార్డు కార్యదర్శులు అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి, తగిన చర్యలు చేపట్టాలన్నారు. నగర అభివృద్ధిలో జీవీ ఎంసీ అధికారులది కీలకపాత్ర అన్నారు. జీవీఎంసీ లో విలీనమైన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని, కొండవాలు ప్రాంతాల్లో కొండ చరియలు విరిగి పడకుండా రక్షణ గోడలు నిర్మించాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటికి కుళాయి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధి లైట్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులు తక్కువగా వసూలవుతున్నాయని, రెవెన్యూ అధికారులు వాటిపై దృష్టిసారించాలన్నారు. మధురవాడ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున, ఇక్కడికి ఐటీ పరిశ్రమలు వస్తుండడంతో ప్రజలకు శతశాతం మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు.అనంతరం జోన్‌లో ఉన్న అన్ని విభాగాల సమస్యలను, అభివృద్ధి పనుల గురించి జడ్సీ సింహాచలం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్, అదనపు కమిషనర్ సోమన్నారాయణ, సీఎంహెచ్‌ఓ నరేశ్ కుమార్, యూసీడీ పీడీ సత్యవేణి, పర్యవేక్షక ఇంజనీర్ శ్యామ్‌సన్‌రాజు పాల్గొన్నారు.

ఆక్సిజన్ టవర్స్‌లో అగ్నిప్రమాదం

సీతమ్మధార, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార ప్రాంతంలో ఉన్న ఆక్సిజన్ టవర్స్‌లోని 32వ అంతస్తులో గల ఓ ఫ్లాట్‌లో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. తొలుత ఫ్లాట్‌లో నుంచి పొగలు, మంటలు రావడాన్ని గమనించిన ఇరుగుపొరుగువారు అప్రమత్తమై తలుపు తెరవడానికి ప్రయత్నించగా లాక్ పడింది.. లోపల ఓ బాలుడు ఉన్నట్లు గమనించి సమీపంలో ఉన్న వెల్డర్‌ను రప్పించి తాళాలు పగులగొట్టి ఆ బాలుడ్ని బయటకు తీశారు. ఆ అంతస్తులో ఉన్న మిగిలిన ఇళ్లవారు భయంతో ఉరుకులు, పరుగులతో కిందికి దిగి తమను తాము కాపాడుకున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. అదే సమయంలో అక్కడ విద్యుత్ సరఫరా నిలిచిపోయి చీకటిగా ఉండడంతో ఎవరికీ ఏమీ కనిపించలేదు. ప్రమాదం జరిగిన ఫ్లాట్‌లో కుటుంబ పెద్దలు ఎక్కడ ఉన్నదీ తెలియలేదు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు వచ్చి పరిశీలిస్తున్నారు. ప్రమాద కారణాలు, ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

సింహాద్రి ఎక్స్‌ప్రెస్, కాకినాడ పాసింజర్ రద్దు

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధి రాఘవపురం, రామగుండం స్టేషన్ల మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పినందున గురువారం గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), కాకినాడ పోర్టు-విశాఖ (17267), విశాఖ-కాకినాడ పోర్టు (17268) రైళ్లు రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 15న విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240)ను కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

రద్దీగా ఉండే రైళ్లకు అదనపు ఏసీ, స్లీపర్ క్లాసు కోచ్‌లు

ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు రైళ్లకు అదనపు కోచ్‌లు జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు (18463) ఈ నెల 14 నుంచి 21 వరకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు, బెంగళూరు-భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు (18464) ఈ నెల 15 నుంచి 22 వరకు రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు, భువనేశ్వర్-తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు (22879) ఈ నెల 16న రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు, తిరుపతి-భువనేశ్వర్(22880) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 17న రెండు థర్డ్ ఏసీ కోచ్‌లు జత చేస్తున్నట్లు తెలిపారు. విశాఖ-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్‌కు (20805) ఈ నెల 15 నుంచి 30 వరకు సెకెండ్ ఏసీ కోచ్, న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్‌కు (20806) ఈ నెల 17న సెకెండ్ ఏసీ కోచ్, విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు (22847) ఈ నెల 24న థర్డ్ ఏసీ కోచ్, ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (22848) ఈ నెల 26న థర్డ్ ఏసీ కోచ్, విశాఖ-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు (18519) ఈ నెల 25 నుంచి 30 వరకు థర్డ్ ఏసీ, ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (18520) ఈ నెల 27 నుంచి డిసెంబరు 2 వరకు థర్డ్ ఏసీ కోచ్, విశాఖ-డిఘా ఎక్స్‌ప్రెస్‌కు (22874) ఈ నెల 28న థర్డ్ ఏసీ కోచ్, డిఘా-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు (22873) ఈ నెల 29న ఒక థర్డ్ ఏసీ కోచ్, గాంధీధాం-పూరి ఎక్స్‌ప్రెస్‌కు (22973) ఈ నెల 20, 27న ఒక స్లీపర్ క్లాసు కోచ్, పూరి-గాంధీధాం ఎక్స్‌ప్రెస్‌కు (22974) ఈ నెల 23, 30న ఒక స్లీపర్ క్లాసు జత చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కోరాపుట్, జగదల్‌పూర్ సెక్షన్‌లో డీఆర్‌ఎం పర్యటన

వాల్తేరు డివిజన్ పరిధిలోని కోరాపుట్, జగదల్‌పూర్ సెక్షన్‌లో డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్ బుధవారం తనిఖీలు చేపట్టారు. డబుల్ లైను పనులు, అభివృద్ధి కార్యకలాపాలను పరిశీలించి సివిల్ ఇంజనీర్, ఆపరేషన్స్, ఎలక్ట్రికల్, టెలికాం, కమర్షియల్ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం దిలిమిలి, దంతెవార స్టేషన్లకు చేరుకుని అక్కడి ప్రయాణికుల సదుపాయాలను పరిశీలించారు. వివిధ ప్రాంతాల్లోని లెవెల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలపై అధికారులతో చర్చించారు. అధికారులతో సంప్రదించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దిశగా పలు సూచనలు చేశారు.

నేటి నుంచి కేన్సర్ స్క్రీనింగ్ సర్వే



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తదితరులు

సీతంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా మధుమేహం, అధిక రక్తపోటు, సాధారణ కేన్సర్‌లు(ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్) స్ర్కీనింగ్ సర్వే గురువారం నుంచి ప్రారంభమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఆంధ్ర వైద్య కళాశాలలో ఉన్న వైద్య నిపుణులు హామీ భాభా పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ స్థాయిల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి యుక్త వయసు దాటిన అందరికీ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. 30 సంవత్సరాల వయసు దాటిన వారికి నోటి కేన్సర్ పరీక్ష, ఇదే వయసు మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ల కోసం వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాధారణ ప్రజానీకానికి పూర్తి అవగాహన కల్పించాలని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

నిరాశ్రయ ఆశ్రమాలను తరలించొద్దు: మెప్మా ఎండీ

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని పట్టణ నిరాశ్రయ ఆశ్రమాలను శివారు ప్రాంతాలకు తరలించవద్దని ఆదేశిస్తూ మెప్మా ఎండీ ఎన్.తేజ్‌భరత్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. నగరంలో భిక్షాటన చేసుకునేవారు, అనాధలు, మానసిక రుగ్మతలతో రోడ్లపై తిరిగేవారు, వృద్ధాప్యంలో ఆదరణకు నోచుకోని వారికి ఆశ్రయం కల్పించేందుకు జీవీఎంసీ, మెప్మా సంయుక్తంగా పట్టణ నిరాశ్రయ ఆశ్రమాలను నిర్వహిస్తున్నాయి. వీటిలో కొన్నింటిని నగర శివారు ప్రాంతాలకు తరలించాలనే ప్రతిపాదన జీవీఎంసీ అధికారుల్లో ఉన్నట్టు ప్రచారం జరగడంతో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ మెప్మా ఎండీకి ఫిర్యాదు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం రైల్వేస్టేషన్, బస్టాండ్‌కు 500 మీటర్ల దూరంలోనే నిరాశ్రయ ఆశ్రమాలుండాలని, దూరప్రాంతాలకు తరలిస్తే ఆశ్రయం పొందేవారికి రక్షణ, వైద్య సదుపాయాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మెప్మా ఎండీ కేంద్రాలను తరలించవద్దని, ఒకవేళ తరలిస్తే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొనాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గవర కార్పొరేషన్ సభ్యులుగా నలుగురి నియామకం

కంచరపాలెం/మర్రిపాలెం,/అల్లిపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర కార్పొరేషన్ సభ్యులుగా 57వవార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, మర్రిపాలేనికి చెందిన పొలమరశెట్టి శ్రీనివాసరావులను ప్రభుత్వం నియమించింది. టీడీపీ కేంద్ర కమిటీ వీరికి నియామక పత్రాలు పంపింది. టీడీపీలో ఉంటూ సుదీర్ఘకాలంగా వీరు ఆయా ప్రాంత ప్రజలకు సేవలందిస్తున్నారు. తమకు అవకాశమిచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబులకు వీరు వేర్వేరుగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే దక్షిణ నియోజకవర్గంలోని అల్లిపురం 33వ వార్డుకు చెందిన జనసేన నాయకుడు భీశెట్టి గోపీకృష్ణ, 32వ వార్డు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధా లక్ష్మీనారాయణలను సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. గవర సామాజిక వర్గం అభ్యున్నతికి తమవంతు కృషి చేస్తామని వీరు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

ఏడో వార్డులో లైట్లు ఏర్పాటు

మధురవాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని కొన్ని ప్రాంతాలకు అధికారులు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పిళ్లా మంగమ్మ కౌన్సిల్ సమావేశంలో చేసిన వినతి మేరకు పిలకవానిపాలెం, చంద్రంపాలెం, ఎన్‌జీఓ కాలనీ, దుర్గానగర్ ప్రాంతాల్లో 50 కొత్త లైట్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లోనూ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు.

ఉద్యానవనంగా డంపింగ్ యార్డు

... 5వ పేజీ తరువాయి

'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంటును పీపీపీ విధానంలో జిందాల్ కంపెనీ ఏర్పాటుచేసింది. నగరంలో ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న 1100 టన్నుల చెత్తలో దాదాపు 750 టన్నుల తడి చెత్తను ఎనర్జీ ప్లాంట్‌కు తరలించేస్తున్నారు. ఇక పొడి చెత్తలో ప్లాస్టిక్‌ను వేరుచేసి ప్లాస్టిక్ పిల్లెట్‌ల తయారీకి, పేపర్ వేస్ట్‌ను అట్టల తయారీకి, గాజు వ్యర్థాలను గాజు వస్తువులు తయారీకి ముడి సరకు తయారుచేసే యూనిట్లకు, డెబ్రిస్‌ను యార్డులోనే ఉన్న బ్రిక్ తయారీ యూనిట్‌కు అందజేస్తున్నారు. దీని వల్ల ప్రస్తుతం ఏరోజు చెత్త ఆదేరోజు వివిధ రీసైక్లింగ్ యూనిట్ల ద్వారా శాస్త్రీయ పద్ధతిలో పునర్వినియోగం అయిపోతోంది. ఎటొచ్చీ లెగసీ వేస్ట్ (గతంలో యార్డులో పేరుకుపోయిన చెత్త)తోనే సమస్య. దానిని జిగ్మా ఎన్విరాన్‌మెంటల్ సొల్యూషన్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ బయో మైనింగ్ చేస్తోంది. లెగసీ వేస్ట్‌ను 'బయో రెమిడేషన్' పద్ధతిలో యంత్రాలతో తవ్వి తీసి అందులోని ప్లాస్టిక్, గాజు, కాగితం, డెబ్రిస్ (కన్‌స్ట్రక్షన్ అండ్ డిమాలిషన్) వ్యర్థాలను వేరుచేస్తున్నారు. ఆ తర్వాత ప్లాస్టిక్, గాజు వ్యర్థాలను యార్డులోనే ఏర్పాటుచేసిన సంబంధిత యూనిట్లకు తరలించి వాతావరణానికి ఇబ్బంది తలెత్తకుండా కరిగించేసి పునర్వినియోగానికి అనుగుణంగా మార్చుతున్నారు. అలాగే యార్డులోని భవన నిర్మాణ వ్యర్థాలను సీ అండ్‌డీ యూనిట్ ద్వారా సిమెంట్ బ్రిక్, టైల్స్ తయారుచేస్తున్నారు. ఇప్పటివరకూ 9.5 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను రీసైక్లింగ్ చేయడంతో 33 ఎకరాలు ఖాళీ అయింది.

యార్డులో పేరుకుపోయిన లెగసీ వేస్ట్‌ను వీలైనంత త్వరగా ఖాళీ చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించిన నేపథ్యంలో గతంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీగా పనిచేసిన అనుభవంతో జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ కాపులుప్పాడ యార్డును పూర్తిగా ఖాళీ చేసేందుకు కార్యాచరణ రూపొందించారు. దీనిని అమలు చేసే క్రమంలో ఇటీవల ఆయన కాపులుప్పాడ యార్డును సందర్శించారు. అక్కడ ప్రస్తుతం ఉన్న రీసైక్లింగ్ యూనిట్‌ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని ప్రతినిధులను ఆదేశించారు. వచ్చే ఏడాది అక్టోబరు రెండో తేదీ నాటికి యార్డులో ఉన్న లెగసీ వేస్ట్ మొత్తాన్ని ఖాళీ చేయాలనే లక్ష్యంతో కొత్తగా మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్ (ఎంఆర్‌ఎఫ్) యూనిట్ ఏర్పాటుపనులను వేగవంతం చేయాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. యూనిట్ అందుబాటులోకి వస్తే లెగసీ వేస్ట్‌లోని ప్లాస్టిక్, క్లాత్, పేపర్ వంటి వ్యర్థాలను వేరుచేసి వాటిని రీసైక్లింగ్‌కు అవసరమయ్యే ముడిసరకుగా తయారుచేసి ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలకు సరఫరా చేస్తారు. అలాగే బయో సీఎన్‌జీ గ్యాస్ ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించడంతో ఆ యూనిట్‌కు ప్రతిరోజూ 20 టన్నులు తడిచెత్తను అందజేస్తున్నారు.

చెత్త యార్డును ఉద్యానవనంగా తీర్చిదిద్దుతాం

కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని లెగసీ వేస్ట్‌ను వచ్చే ఏడాది అక్టోబరు రెండు నాటికి పూర్తిగా ఖాళీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఖాళీ అయిన యార్డులో మొక్కలు నాటి ఉద్యానవనంగా మార్చుతాం. యార్డులో ఏళ్ల తరబడి చెత్త పేరుకుపోయి ఉండడంతో భూమిలోకి ప్రమాదకరమైన రసాయనాలు చేరి ఉంటాయి. కాబట్టి ఆ భూమిలో కనీసం 15 సంవత్సరాల పాటు గ్రీన్ బెల్ట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. ప్రస్తుతం యార్డులో 9.5 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను ఖాళీ చేయడంతో 33 ఎకరాల భూమి అందుబాటులోకి వచ్చింది. ఆ భూమిలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

-పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్

మెట్రో ప్రాజెక్టుపై వాడీవేడిగా..

... 5వ పేజీ తరువాయి

నిరిస్తారా?, విడిగా నిర్మిస్తారా?...వివరించాలని కోరారు.

కేంద్రం నుంచి అనుమతి రాగానే ముందుకు వెళతాం: పి.నారాయణ, మంత్రి

ఈ అంశంపై పురపాలక శాఖా మంత్రి పి.నారాయణ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. విశాఖ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సమగ్ర రవాణా ప్రణాళిక కేంద్రానికి సమర్పించామని, అనుమతి రాగానే ముందుకు వెళతామని చెప్పారు. గాజువాక నుంచి కొమ్మాది వరకు 42.5 కి.మీ. పొడవున మూడు కారిడార్ల నిర్మాణానికి డీపీఆర్ తయారుచేసి నాటి టీడీపీ ప్రభుత్వం కేంద్రానికి పంపిందన్నారు. టెండర్లు పిలవగా కొన్ని కంపెనీలు బిడ్లు కూడా వేశాయన్నారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టెండర్లు రద్దు చేసి కారిడార్‌ను భోగాపురం విమానాశ్రయం వరకూ పొడిగించిందని, దాంతో కేంద్రం దానిని పక్కన పెట్టేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆ తరువాత ముందుకు వెళ్లలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కోల్‌కతా మెట్రో రైలు తరహాలో వంద శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చేలా, రైల్వే శాఖకు ప్రాజెక్టు అప్పగించేలా ప్రతిపాదనలు కేంద్రానికి పంపించామన్నారు. రెండు దశల్లో నాలుగు కారిడార్లు నిర్మిస్తామన్నారు.

మొదటి దశలో 46.23 కి.మీ. పొడవున మూడు కారిడార్లు వస్తాయన్నారు. మొదటి కారిడార్ స్టీల్ ప్లాంటు నుంచి కొమ్మాది వరకూ 34.4. కి.మీ., రెండో కారిడార్ గురుద్వారా నుంచి పాత పోస్టాఫీసు వరకు 5.07 కి.మీ., మూడో కారిడార్ తాటిచెట్లపాలెం నుంచి చినవాల్తేరు వరకు 6.75 కి.మీ. ఉంటుందన్నారు. దీనికి రూ.11,498 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశామన్నారు. రెండో దశలో కొమ్మాది నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు 30.67 కి.మీ., 12 స్టేషన్లతో మెట్రో నిర్మాణానికి ప్రతిపాదన చేశామన్నారు. మెట్రో కారిడార్ వెళ్లే మార్గంలో ఎక్కువ క్రాసింగ్స్ ఉన్నందున ప్రతి క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా కార్‌షెడ్డు, ఎండాడ, హనుమంతవాక, మద్దిలపాలెం, విప్రో, గురుద్వారా, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, గాజువాక, స్టీల్‌ప్లాంటు జంక్షన్ల వద్ద టూ లెవెల్ మెట్రో, ఫ్లైఓవర్లు నిర్మించాలని ప్రతిపాదించినట్టు వివరించారు.

మహా మేత

... 5వ పేజీ తరువాయి

తాత్కాలిక కార్మికులకు కాంట్రాక్టర్ ద్వారా సక్రమంగా వేతనాలు అందడం లేదని, అందువల్ల యూసీడీ పరిధిలో కొన్ని ఎస్‌ఎల్‌ఎఫ్‌లను ఎంపిక చేసి వాటి ద్వారా చెల్లించాలని సూచించారు. పాలక వర్గంలో కీలక నేత కావడంతో ఈ ప్రతిపాదనను అధికారులు ఆగమేఘాలపై అమలుచేశారు. యూసీడీ అధికారులు సదరు నేత సూచించిన ఎస్‌ఎల్‌ఎఫ్‌లను జోన్‌ల వారీగా ఎంపిక చేసి వారి ఖాతాల్లో కార్మికుల వేతనాలు జమ చేయడం ప్రారంభించారు. పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులు 790 మందికి కూడా ఎస్‌ఎల్‌ఎఫ్‌ల ద్వారానే వేతనాలు చెల్లించేలా ఆ విభాగం అధికారులపైనా ఒత్తిడి చేశారు.

నెలకు రూ.3.23 లక్షలు మినహాయింపు

మలేరియా విభాగంలో 406 మంది, పారిశుధ్య విభాగంలో 790 మంది తాత్కాలిక కార్మికులకు రోజుకు రూ.450 చొప్పున జీవీఎంసీ చెల్లిస్తోంది. ఈ మొత్తం రూ.1,61,46,000 ఎస్‌ఎల్‌ఎఫ్‌ల ఖాతాలకు జమ చేస్తోంది. వేతనాలను చెల్లిస్తున్నందుకు గానూ ఎస్‌ఎల్‌ఎఫ్‌లు సర్వీస్ చార్జీ కింద రెండు శాతం మినహాయించుకుంటున్నాయి. అంటే నెలకు సుమారు రూ.3.23 లక్షలు. ఆ మొత్తాన్ని తమ పరిధిలోని మహిళా సంఘాలకు పంచాలి. ఇదికాకుండా కార్మికుల వేతనాలను జీవీఎంసీ నుంచి తీసుకుని కార్మికులకు అందజేసే క్రమంలో భారీగా లావాదేవీలు జరుగుతుంటాయి కాబట్టి రెండు శాతం మొత్తాన్ని ఐటీ కింద మినహాయించారు. కార్మికులు ఐటీ రిటర్న్స్ లేదా ఐటీ శాఖ నుంచి ప్రత్యేక అనుమతితో ఆ మొత్తాన్ని తిరిగి పొందే వీలుంటుంది. సంబంధిత పత్రాన్ని ఎస్‌ఎల్‌ఎఫ్‌లకు అందజేస్తే వారు ఐటీ శాఖకు పంపి, మినహాయించిన మొత్తాన్ని తిరిగి పొందడం ద్వారా కార్మికులకు ఇవ్వాలి. కానీ కార్మికులకు ఐటీ రిటర్న్స్‌పై అవగాహన ఉండదు కాబట్టి ఎస్‌ఎల్‌ఎఫ్‌లు తమ ఖాతాలోనే ఆ మొత్తాన్ని ఉంచుకుంటున్నాయి. సర్వీస్ చార్జీ కింద మినహాయిస్తున్న మొత్తంలో ఎస్‌ఎల్‌ఎఫ్‌ల అధ్యక్ష, కార్యదర్శులకు కొంత, మిగిలిన మొత్తాన్ని వైసీపీ నేత జేబులో వేసుకుంటున్నారని కూటమి కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ అంశం లేవనెత్తడంతో సభలో వాదోపవాదాలు జరిగాయి. తాజాగా కొంతమంది స్టాండింగ్ కమిటీ సభ్యులు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించడంతో పాటు కార్మికులకు వేతనాలు ఇస్తున్న ఎస్‌ఎల్‌ఎఫ్‌లను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

జిల్లా జడ్జి ధోరణిని నిరసిస్తూ న్యాయవాదుల విధుల బహిష్కరణ

18 నుంచి 20 వరకూ ప్రధాన న్యాయస్థానానికి వెళ్లబోమని ప్రకటన

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):జిల్లా ప్రధాన న్యాయమూర్తి ధోరణిని నిరసిస్తూ మూడు రోజుల పాటు ప్రధాన న్యాయస్థానానికి వెళ్లకూడదని న్యాయవాదుల సంఘం నిర్ణయించింది. జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం న్యాయవాదులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ జిల్లా ప్రధాన న్యాయస్థానాన్ని బహిష్కరించనున్నట్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ వెల్లడించారు. దీనిపై ఇప్పటికే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసినట్టు వారు పేర్కొన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఎస్.కృష్ణమోహన్ మాట్లాడుతూ విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించినందున ఇక్కడ హైకోర్టు బెంచ్ కూడా ఏర్పాటుచేయాలన్నారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి నరేశ్‌తో పాటు సీనియర్ న్యాయవాది కర్రి ఆదిబాబు, పెద్ద సంఖ్యలో నాయవాదులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఒక్కరోజే రూ.16 లక్షల ఆస్తి పన్ను వసూలు

జ్ఞానాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని 28, 31 వార్డులలో బుధవారం ఒక్కరోజే రూ.16 లక్షల ఆస్తిపన్ను వసూలు చేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన చెక్కును జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు అందజేశారు. ఆర్ఓ అప్పలరాజు, ఆర్ఐలు సీతారాం, ఉదయ్‌భాస్కర్, వార్డు అడ్మిన్ కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్ పాఠశాలలపై సానుకూలంగా వ్యవహరించాలి'

దొండపర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంటిమహంతి ప్రవీణ్ కోరారు. దొండపర్తిలో బుధవారం జరిగిన చిన్న పాఠశాలల కరస్పాండెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ తర్వాత ప్రైవేట్ విద్యా వ్యవస్థ దారుణంగా పతనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అప్రజాస్వామిక నిబంధనలు పెడుతూ, పాటించకపోతే చర్యలు తీసుకుంటామని బెదిరించడంతో తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సుదర్శన్, కార్యదర్శి పీవీవీ వరప్రసాద్, ఉపాధ్యక్షుడు ఎం.ఉమామహేశ్వరరావు, నాయకులు ఎస్‌కే రత్నం, వరలక్ష్మి, సీహెచ్ మాధవి, అనంత లక్ష్మి, వి.మహేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాప అపహరణకు యత్నం!

... 5వ పేజీ తరువాయి

కుమార్తెను గట్టిగా పట్టుకుని వదలకపోవడంతో పాపను అపహరించేందుకు వచ్చిన మహిళలు బ్లేడ్‌తో పద్మ మెడపై గాయపర్చారు. ఆమె చేతిపై కూడా గాయమైంది. ఈ సమయంలో పద్మ పెద్దగా కేకలు వేయడంతో ఇద్దరు మహిళలు వాహనంపై పరారయ్యారు. వారిద్దరూ రెండు రోజుల నుంచి ఇదే మార్గంలో తిరుగుతున్నారని, మంగళవారం రాత్రి మాత్రం నేరుగా ఇంటికి వచ్చి పాపను అపహరించేందుకు యత్నించారని పద్మ తెలిపింది. దీనిపై గాజువాక పోలీసులకు పద్మ సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆదాయం రూ. 39.28 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న దేవాలయ అధికారులు, సిబ్బంది

జగదాంబ కూడలి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి హుండీల్లో కానుకల లెక్కింపు బుధవారం ఆలయ ప్రాంగణంలో దేవస్థానం అధికారులు చేపట్టారు. భక్తులు సమర్పించిన 63 రోజుల (11-9-24 నుంచి 13-11-24) కానుకల ఆదాయం రూ.39.28 లక్షలు, బంగారం 52 గ్రాములు, వెండి 123 గ్రాములు విదేశీ కరెన్సీ వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఈవో కె.తిరుమలేశ్వరరావు, ఎస్.వరప్రసాద్, యూనియన్ బ్యాంక్ మేనేజరు జి.రామకృష్ణ, వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపండి: ఆర్డీవో

మహారాణిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపుతూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని విశాఖ ఆర్డీవో పి.శ్రీలేఖ సూచించారు. బుధవారం స్థానిక ఆర్‌డీవో కార్యాలయంలో సబ్‌డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు, ఇందులో భాగంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదైన కేసుల దర్యాప్తు వేగవంతం చేసి, బాధితులకు నిర్ణీత సమయంలో నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. పథకాలు ఎస్సీ, ఎస్టీలకు చేరువ చేస్తూ, అన్ని విధాలా అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో నగర పరిధిలోని ఏసీపీలు, తహసీలార్లు, జీవీఎంసీ, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి సన్నాహాలు



శిథిలమైన కర్రివారి వంతెనను పరిశీలిస్తున్న టీడీపీ నేత బొడ్డేటి మోహన్, అధికారులు

అక్కయ్యపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 43వ వార్డులోని కర్రివారి వంతెన శిథిల స్థితికి చేరుకోవడంతో దాని స్థానంలో రూ.53 లక్షలతో కొత్తది నిర్మించడానికి జీవీఎంసీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి మోహనరావు, ఏఈ రమణమ్మ, విద్యుత్ శాఖ ఏఈ బుధవారం వంతెనను పరిశీలించారు. దీన్ని కూల్చేసి జీవీఎంసీ నిధులతో కొత్తగా నిర్మించేందుకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు ఏఈ రమణమ్మ తెలిపారు.

కేజీహెచ్ ఏడీగా అప్పారావు



అప్పారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

మహారాణిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పి.ఎన్. అప్పారావు నియమితులయ్యారు. ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కేజీహెచ్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘ ప్రతినిధులు, ల్యాబ్ టెక్నీషియన్ సంఘ ప్రతినిధులు ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు రామ్‌ప్రసాద్, బి.వి.ఎస్. ప్రసాద్, నాగు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాల పంపిణీ



మహిళలకు వస్త్రాలు అందిస్తున్న డిప్యూటీ మేయర్ సతీష్ తదితరులు

అక్కయ్యపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో సంభవించిన వరదల సమయంలో 46వ వార్డుకు చెందిన పారిశుధ్య కార్మికులు అక్కడ విశేష సేవలందించడం ఎంతో ఆనందదాయకమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. ఈ మేరకు బుధవారం వారికి శాంతినగర్‌లోని వార్డు కార్యాలయలో నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి పని చేసే పారిశుధ్య కార్మికుల సేవలను ఎంత కీర్తించినా తక్కువేనన్నారు. కరోనా సమయంలో వారు అందించిన సేవలను దృష్టిలో ఉంచుకుని ఆయన స్పందించారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యం, అప్పారావు, సోమునాయుడు, సచివాలయం కార్యదర్శి సత్యం, వార్డు సూపర్‌వైజర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలివే

కూర్మన్నపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వుడా నగర్ ఫీడర్-ఎఫ్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున ఈ నెల 15వ తేదీ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ కారణంగా వుడా నగర్-5,7, పకీరుతక్యా, గ్రీన్ సిటీ, యాదవజగ్గరాజుపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 68వ వార్డులోని పారిశుధ్య కార్మికులకు బుధవారం కార్పొరేటర్ గుడివాడ అనూష దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల విజయవాడ వరద బాధితులకు సాయం అందించడంలో పారిశుధ్య కార్మికులు చేసిన కృషి అమోఘమన్నారు. వార్డుల పరిశుభ్రత కోసం వారు అందిస్తున్న సేవలు గొప్పవన్నారు. కార్యక్రమంలో నాయకుడు గుడివాడ లతీష్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఉక్కునగరం విద్యార్థి


శివాశిశ్

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 13 (ఆంధ్ర జ్యోతి): ఢిల్లీలో గురువారం నుంచి జరగనున్న జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు స్టీల్‌ప్లాంట్ లిటిల్ ఏంజెల్స్ పాఠశాల విద్యార్థి జి.చేతన్ శివాశిశ్ ఎంపికయ్యాడు. ఇటీవల నగరంలో ఆక్వా స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో బంగారు పతకం సాధించిన శివాశిశ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ విశాలాక్షి, హెచ్ఎం అరుంధతిలు అభినందించారు.

నేడు సాయి ఏకధాటి నామం

అగనంపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి షిర్డీ సాయి మందిరంలో పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం ఉదయం నుంచి 24 గంటల పాటు ఓం సాయి శ్రీ సాయి అంటూ ఏకధాటి నామం జపించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు షిర్డీసాయి సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం ఆరుకు జపం ప్రారంభమై మర్నాడు ఉదయం ఆరు గంటల వరకు సాగుతుందన్నారు. సాయిబాబా భక్తులతో పాటు కమిటీ సభ్యులు, భజన బృందాలు కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరారు.

నకిలీ పోలీసు అరెస్టు


వెంకటరమణ

ఆరిలోవ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ పోలీసును పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకొని ఆరిలోవ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన వంతల వెంకటరమణ (33) పోలీసు యూనిఫారం ధరించి జాతీయ రహదారిపై డెయిరీ ఫాం వద్ద సెల్‌ఫోన్లు అమ్మేందుకు యత్నిస్తుండగా, స్థానికులు అనుమానించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీఎం పాలెం క్రైం పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితుడిని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. కాగా, వంతల వెంకటరమణపై ఇది వరకే సబ్బవరం పీఎస్‌లో 11 కేసులున్నాయి. ఈ కేసుతో కలిసి 12 కేసులున్నట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సినిమా గైడ్

- **కంగువా :** సంగం, జగదాంబ, మెలోడి, శ్రీరామ, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక)
- **మట్కా :** శరత్, శారద, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** లిఖిత (శ్రీహరిపురం)
- **క :** జగదాంబ, సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 54, టమాటా 26, వంకాయలు (తెలుపు)30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 30, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 38, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 32, క్యారెట్ 54 దొండకాయలు 32, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)55, బరబాటి 34, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 42, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 62, పొటల్స్ 50, కీరదోస 28, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 66, దేముడు చిక్కుడు 72, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	525
విజయనగరం	529
శ్రీకాకుళం	529

చికెన్ ధరలు	
బ్రాయిగ్	
రైతు ధర	97
ఫారం ధర	117
విత్ స్కిన్	204
స్కిన్‌లెస్	214

కీలక కూడళ్లకు మహర్దశ

సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు

కూటమి ప్రభుత్వ హయాంలో ఇప్పటికే చకచకా సాగుతున్న రహదారుల అభివృద్ధి పనులు


సుందరంగా రూపుదిద్దుకోనున్న జగ్గు జంక్షన్

గాజువాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ గాజువాక జోనల్ పరిధిలో కీలక కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే అధ్వానంగా ఉన్న జగ్గు జంక్షన్‌ను సుందరంగా తీర్చిదిద్దే పనులు దాదాపుగా పూర్తి కావస్తుండగా.. మరికొన్ని కూడళ్లను ఇదే తరహాలో తీర్చిదిద్దనున్నారు. గోతులతో అస్తవ్యస్తంగా ఉన్న రహదారుల అభివృద్ధి పనులు దాదాపు పూర్తి కావడంతో కీలక జంక్షన్‌లను సుందరంగా తీర్చిదిద్దడం వల్ల గాజువాక ఎంతో ఆకర్షణీయంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే వంటిల్లు జంక్షన్, వుడా కాలనీ కూడలి,పాత గాజువాక, కొత్త గాజువాక, బీసీ రోడ్డు, కాకతీయ జంక్షన్‌లను సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను రూపొందించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గాజువాక పరిధిలో రహదారులు మొత్తం పెద్ద పెద్ద గోతులతో నిండి ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు.

అప్పట్లో కేవలం ఒకట్రెండు రోడ్లను మాత్రమే అభివృద్ధి చేయగా, అధిక శాతం గోతుల మయమైన రహదారుల గురించి పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో భారీ వర్షాల సమయంలో ఛిద్రంగా మారిన ఆయా రహదారుల గుండా రాకపోకలు సాగించేందుకు ప్రజలు నరకయాతన పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధానంగా రహదారుల అభివృద్ధికి అధిక శాతం నిధులు కేటాయించడంతో రోడ్లను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారు. దీంతో గాజువాక పరిధిలోని రహదారులతో పాటు కీలక కూడళ్లను సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

పరిశ్రమలు స్థాపించేలా విద్యార్థులు ఎదగాలి

జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆదిశేషు


ఆదిశేషును సత్కరించిన విజ్ఞాన్ ప్రతినిధులు

అగనంపూడి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు స్థాపించే స్థాయి విద్యార్థులు ఎదిగేందుకు కృషి చేయాలని జిల్లా పరిశ్రమల కేంద్రం (డీఐసీ) జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు సూచించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అంశంపై విద్యార్థులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే స్టార్టప్‌లు, చిన్న చిన్న వ్యాపారాలు, ప్రభుత్వ రాయితీల గురించి అవగాహన కల్పించుకోవాలన్నారు. అనంతరం ఆదిశేషును విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, కో-ఆర్డినేటర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా తారురోడ్డు నిర్మాణ పనులు


65వ వార్డులో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

పెదగంట్యాడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డులో బుధవారం నుంచి తారు రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక అన్ని ప్రాంతాల్లోను అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగానే 65వ వార్డు ప్రియదర్శని కాలనీ నుంచి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, అశోకనగర్, కొత్తదిబ్బపాలెం నిర్వాసిత కాలనీ నుంచి యాతపాలెం జంక్షన్ వరకు ఉండే ప్రధాన రహదారిని తారురోడ్డుగా తీర్చిదిద్దుతున్నారు. సుమారు ఏడేళ్ల క్రితం వేసిన ఈ రోడ్డు పూర్తిగా గోతులమయమవ్వడం, రాళ్లుతేలి పోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తారురోడ్డు నిర్మాణ పనులు చేపట్టింది. కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు బుధవారం ఈ పనులను పరిశీలించారు. నాణ్యతలో రాజీ పడకుండా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే 64వ వార్డు పరిధి కొత్త దిబ్బపాలెంలోని ప్రధాన రహదారుల్లోనూ రోడ్డు మరమ్మతు పనులు చకచకా జరుగుతున్నాయి.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గాజువాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్టు లైబ్రేరియన్ బి.చంద్రకళ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం బాలల దినోత్సవం, 15న వ్యాసరచన పోటులు, 16న కవి సమ్మేళనం, 17న ధరావత్తు సేకరణ, ర్యాలీ, పాటల పోటీలు, 18న చిత్రలేఖనం, 19న మహిళా దినోత్సవం, 20న ముగింపు సందర్భంగా వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

ఐరన్ ఓర్‌ను సరఫరా చేయాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రక్రియకు ఎటువంటి ఇబ్బందులు వాటిల్లకుండా నిరంతరం ఐరన్ ఓర్‌ను సరఫరా చేసేందుకు కేంద్రం ముందుకు రావాలని, ఇందుకు కూటమి నాయకులు సహకారాన్ని అందించాలని ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు కోరారు. ఉక్కు ఉత్పత్తులకు మంచి పేరుందని, అందువల్ల అధిక ఉత్పత్తి సాధించేందుకు ఐరన్ ఓర్‌ను మరింతగా పెంచి సరఫరా చేయాలన్నారు.

నేత్ర సమస్యలపై ముగిసిన అవగాహన సదస్సు


వేపగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఈనెల 6 నుంచి నేత్రాలకు సంబంధించి విద్యార్థులకు నిర్వహిస్తున్న చిత్రలేఖనం పోటీలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు జరిగిన పోటీలకు నగరంలోని 86 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల నుంచి 415 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం వారికి కంటిచూపు తగ్గటానికి గల కారణాలను నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో ట్రస్టీ ఆత్మకూరు కృష్ణకుమార్, జీఎం కె. రాధాకృష్ణన్, శంకర్ ఫౌండేషన్ డీజీఎం రమేశ్‌కుమార్, బంగార్రాజు, రజని, లలిత పాల్గొన్నారు.

గవర కార్పొరేషన్ సభ్యులుగా అజయ్‌బాబు, వేగి


అజయ్‌బాబు, వేగి పరమేశ్వరరావు

కంచరపాలెం/పెందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 57వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబును రాష్ట్ర గవర కార్పొరేషన్ సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అజయ్‌బాబు మాజీ కార్పొరేటర్ అప్పారావు తనయుడు. పదేళ్లుగా ఆయన టీడీపీలో తనదైన శైలిలో సేవలందిస్తున్నారు. అలాగే పెందుర్తికి చెందిన వేగి పరమేశ్వరరావు కూడా గవర కార్పొరేషన్ సభ్యుడిగా నియమితులయ్యారు. 96వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా ఉన్న పరమేశ్వరరావు సోదరుడు దివాకర్ విశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, తండ్రి సాంబశివరావు టీడీపీ ఆవిర్భావం నుంచి రెండుసార్లు విశాఖ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్నకు పరమేశ్వరరావు వియ్యంకుడు.

కొప్పల వెలమ కార్పొరేషన్ సభ్యుడిగా రామ్మోహన్‌నాయుడు



మల్కాపురం : రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొ రేషన్ సభ్యుడిగా సీహెచ్ రామ్మోహన్‌నాయుడు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొప్పుల వెలమ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బైక్ దొంగ అరెస్టు

పెందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేపగుంట జంక్షన్‌లో పార్క్ చేసిన బైక్ చోరీ కావడంతో రొంగలి అనిల్‌కుమార్ గతనెల 28న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన ఎస్ఐ సూరిబాబు బుధవారం ఆర్ఆర్‌వీ పురానికు చెందిన తోటయ్యను అరెస్ట్ చేసి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.


పెందుర్తిలో చోరీ జరిగిన రెస్టారెంట్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ సూరిబాబు


వివరాలు వెల్లడిస్తున్న ఏడీసీపీ మోహన్‌రావు

24 గంటల్లో దొంగలను పట్టేశారు

మల్కాపురం, పెందుర్తి పోలీసులకు ఉన్నతాధికారులు అభినందనలు

పెందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు చోట్ల జరిగిన చోరీల కేసుల్లో 24 గంటల్లోనే నిందితులను పట్టుకున్న పెందుర్తి, మల్కాపురం పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు. పెందుర్తి కేసుకు సంబంధించి ఎస్ఐ సూరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆర్ఆర్‌వీ పురం పవర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న క్రిష్టి చికెన్ రెస్టారెంట్‌లో మంగళ వారం అర్ధరాత్రి చోరీ జరిగింది. రెస్టారెంట్‌కు చెందిన సీసీ కెమెరాల వైర్లు కత్తిరించి, షట్టర్ల తాళాలు పగులు కొట్టి నింది తుడు లోపలికి ప్రవేశించాడు. రెస్టారెంట్‌లో ఉన్న ల్యాప్‌టాప్, ఎల్ఈడీ టీవీ, బిల్లింగ్ మానిటర్, ప్రింటర్ చోరీ చేశాడు. ఉదయం రెస్టారెంట్‌కు వచ్చిన సిబ్బంది షట్టర్ తెరిచి ఉండడంతో విషయాన్ని నిర్వాహకుడు పోతురాజుకు చెప్పగా ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సీసీ కెమెరాల్లో సరైన ఆధారాలు లభించకపోవ డంతో షట్టర్ చోరీలో ఆరితేరిన దొంగలపై నిఘా పెట్టారు, ఈమేరకు అక్కయ్యపాలెంకు చెందిన పాత నేరస్థుడు గోడాది హరి సంపత్ (26) అలియాస్ హరిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు, చోరీ జరిగిన 24 గంటల్లోనే నిందితుడ్ని పట్టుకున్న ఎస్ఐ సూరిబాబు, హెచ్ సీలు నాగరాజు, ఎంఎస్ నాయుడు, శివప్రసాద్, దేవుడు నాయుడును ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు అభినందించారు

శ్రీహరిపురం ఎంఐజీ క్వార్టర్స్‌లో..

మల్కాపురం: శ్రీహరిపురం ఎంఐజీ క్వార్టర్స్‌లో చోరీకి పాల్పడిన దొంగను మల్కాపురం పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. ఏడీసీపీ మోహన్‌రావు, క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివ రాలు ప్రకారం.. క్వార్టర్స్‌లో నేవీ రిటైర్డ్ అధికారి ప్రసాద్ సింగ్ నివాసం ఉంటున్నారు. ఈనెల 4న కుటుంబంతో కలిసి టూర్‌కు వెళ్లారు, తిరిగి 11న వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళాలు పగలుగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూడగా 18 తులాల బంగారం, రూ.1.50 లక్షల నగదు చోరీ అయినట్టు గుర్తించి, మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని, సీసీ కెమెరా ఆధారంగా దొంగను పట్టుకున్నారు. రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందిన దాసరి వరహ హరి (47) శ్రీహరిపురం ప్రాంతానికి వచ్చి ఆటోలో పాలు రవాణా చేస్తూ జీవనం కొనసాగిస్తూనే దొంగతనాలు కూడా చేస్తుండేవాడు. అందులో భాగంగా 4న ఎంఐజీ క్వార్టర్స్‌లో ఇంటికి తాళాలు వేసిఉండడాన్ని గుర్తించి 6వ తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో చోరీకి పాల్పడ్డాడు. పోలీసులు 4వ తేదీ నుంచి 11 వరకు ఈ మార్గం మీదుగా రాత్రి వేళ ఎవరెవరు తిరిగారన్నది సీసీ కెమెరాల ఆధారంగా పరిశీలించగా హరి ఎక్కువగా తిరగడం గుర్తించి, అదుపు లోకి తీసుకుని విచారించగా, నేరం అంగీకరించాడు. 24 గంటల్లో కేసును ఛేదించిన ఎస్ఐ రమణను, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

నలుగురు సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసు నమోదు

పెందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియా యాక్టివిస్టులు నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన కాకరపర్తి శ్రీనివాస్ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూపై అసభ్య పదజాలం, బూతులు తిట్టి ఆయన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఫేస్‌బుక్‌లో పోస్టులు పెట్టారు. అలాగే మంత్రి గుమ్మడి సంధ్యారాణిపై తప్పుడు పదజాలంతో సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్న రాయవరంనకు చెందిన ఖండవల్లి సురేశ్‌కుమార్, కోరుకొండకు చెందిన లగవత్తుల శివసత్యకుమార్. కనిగిరికి చెందిన హరీశ్వరరెడ్డిపై టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు. అనకాపల్లి తెలుగు యువత కార్యదర్శి బొడ్డు అప్పలరాజు వేర్వేరుగా ఫిర్యాదులు చేశారు. ఈమేరకు వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మల్కాపురం : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలు పెడుతూ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న పాల భూపాల్‌పై మల్కాపురం పోలీసులకు టీడీపీ నాయకులు రామోహ్మనాయుడు, మిరిరెడ్డి శంకర్, మధుబాబు, రాజా, శ్రీను బుధవారం ఫిర్యాదు చేశారు. తక్షణమే అతనిపై కేసు నమోదు చేయాలని సీఐ విద్యసాగర్‌ను వారు కోరారు.

విమాన భద్రతపై సదస్సు


సదస్సులో కరపత్రం విడుదల చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు నౌకాదళం అధికారులు విమాన భద్రతపై మంగళ, బుధవారాల్లో వార్షిక సదస్సును నిర్వహించారు. ఐఎన్ఎస్ డేగాలో జరిగిన సదస్సుకు తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నేవీ ఎయిర్ ఆపరేషన్లకు ఎదురవుతున్న సవాళ్లు, వాటిని అధిగమించేందుకు అనుసరించాల్సిన విధానాలు, వ్యూహాలు చర్చించారు. మానవ రహిత విమానాలు, సైబర్ సెక్యూరిటీ, సునిశిత శిక్షణ వంటి అంశాలను అధ్యయనం చేయాలని నిర్ణయించారు. దీనికి ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, కోస్టుగార్డుల ప్రతినిధులు హాజరయ్యారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

గోపాలపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయాధికారి ఎన్‌వీ నరసింహం తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ప్రతి విద్యార్థికి అపార్ తప్పనిసరి

జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్

గాజువాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి భవిష్యత్తుకు ఆటోమెటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) తప్పనిసరి అని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. గాజువాకలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బుధవారం గాజువాక, ములగాడ, పెదగంట్యాడ మండలాల ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులందరికీ అపార్ కార్డుల కోసం పాఠశాలల లాగిన్‌లో, ఆన్‌లైన్‌లో నమోదు చేయించేలా చూడాలన్నారు. ఏ స్కూల్ లాగిన్‌లోనూ డ్రాప్ బాక్స్‌లో ఒక విద్యార్థి కూడా ఉండడానికి వీల్లేదన్నారు. ఫార్మాటివ్-1, 2 పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో రవీంద్రబాబు, ఎంఈవోలు సునిత, విశ్వనాథం, శ్రీనివాస్, రమణాజీ, వెంకటరావు, త్రినాదరావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు : డీఈవో

పెందుర్తి: ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు విద్యా శాఖ నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని డీఈవో ప్రేమ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన పురుషోత్తపురంలోని బాలాజీ హైఫీల్డ్స్ స్కూల్లో ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపార్ ఐడీ జనరేట్ గడువు లోగా పూర్తి చేసి, వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఈవో రవీంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని కాంట్రాక్టు కార్మికుల ఆందోళన


ఆందోళనలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీసీ గేటు మార్గంలో అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు లేవని, దీంతో వారి జీవనం చాలా దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల కోసం ఉక్కు యాజమాన్యాన్ని అడుగుతున్నా సరైన సమాధానం చెప్పడం లేదని ఆరోపించారు. కార్మికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం తక్షణమే కార్మికులకు జీతాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు నందికి తాతారావు, పిట్టా రెడ్డి, నమ్మి రమణ, వంశీ, పీవీ రమణమూర్తి, డి.అప్పారావు, పి.శ్రీనివాసరావు, రామిరెడ్డి, శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.

76వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు

పెదగంట్యాడ, నవంబరు 13: సభ్యత్వ నమోదు ద్వారా టీడీపీ బలం ప్రకటితం కావాలని జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. 76వ వార్డు పరిధి నడుపూరులోని టీడీపీ కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయనప్రారంభించి మాట్లాడారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రత్యేక గుర్తింపుతో పాటు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు బాసెట్టి అప్పారావు, నాయకులు తాటికొండ సుదర్శనరావు, బొడ్డు కృష్ణప్రసాద్, పీత రమణ, కూన వెంకటరావు,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల కార్యాలయంలో..

ప్రతి కార్యకర్తా టీడీపీ సభ్యునిగా నమోదు కావాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి అన్నారు. పార్టీ మండల కార్యాలయంలో సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పార్టీ సభ్యత్వం ఉన్నవారికే పదవులు కూడా వరిస్తాయన్నారు. నాయకులు ములకలపల్లి పెంటయ్య, మొల్లి రమణ, ఎం.అప్పారావు, కె.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్వీప్ సదస్సు

పెందుర్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవగాహన కోసం ఎన్నికల సిబ్బంది రెండు రోజులుగా నిర్వహిస్తున్న స్వీప్ సదస్సు బుధవారంతో ముగిసింది. చివరి రోజు పెందుర్తిలోని విస్టమ్ ఇంజనీరింగ్ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ అర్జునరావు మాట్లాడుతూ యువత ఓటు విలువ తెలుసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్క రూ ఓటుహక్కు కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం ఓటింగ్ నమోదు యాప్‌పై అవగాహన కల్పించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవం

వేపగుంట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట బంటా కాలనీలో ఉన్న బ్రహ్మంగారి మఠంలో విరాట్ విశ్వకర్మ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా వైసీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ప్రజల భవిష్యత్తు ఏవిధంగా ఉంటుందో ముందుగా తెలియజేసిన గొప్ప కాలజ్ఞాని వీరబ్రహ్మేంద్రస్వామి అని కొనియాడారు. కార్యక్రమంలో పీఠం సభ్యులు కోటి, శంకర్, లక్ష్మి, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి కొత్త రాడార్


డాల్ఫిన్ నోస్‌పై ఏర్పాటు చేసిన కొత్త రాడార్

విశాఖపట్నం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం విమానాశ్రయం నిఘా కోసం కొత్త రాడార్‌ను ఏర్పాటు చేశారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూపొందించిన ఈ అధునాతన రాడార్‌ను డాల్ఫిన్స్ నోస్ కొండపై పెట్టారు. విమానాశ్రయం పరిసరాల్లో గగనతలంపై విమానాల రాకపోకలకు సంబంధించిన సమాచారం నిరంతరం దీని నుంచి అధికారులకు అందుతుంది. ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు ఇది ఎంతగానో దోహద పడుతుందని ఐఎన్ఎస్ డేగా అధికారులు పేర్కొన్నారు. ఈ రాడార్‌ను పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేశారు.

అధికారులతో వ్యాపారుల వాగ్వాదం

మల్కాపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న కూరగాయల వ్యాపారులు జీవీఎంసీ అధికారులతో వాగ్వావాదానికి దిగారు. షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కూరగాయల వ్యాపారులు ఉండడం వల్ల తమకు ఇబ్బంది కలుగుతుందని షాపింగ్ కాంప్లెక్స్‌కు చెందిన దుకాణదారులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు జోన్ 5 కమిషనర్ రాము సిబ్బందితో కలిసి బుధవారం కాంప్లెక్సుకు చేరుకుని కూరగాయల దుకాణాలు తొలగించేందుకు ప్రయత్నించగా వ్యాపారులు అడ్డుకొని, వాగ్వావాదానికి దిగారు. దుకాణాలు తొలగించాలని షాపుల యజమానులు, తొలగిస్తే సహించేదిలేదని కూరగాయల వ్యాపారులు హెచ్చరిస్తున్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ప్రణవ్‌గోపాల్


మంత్రి లోకేశ్‌తో ప్రణవ్‌గోపాల్, అతని తల్లి సుమతి

వెంకోజీపాలెం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ మెట్రోపాలిటన్ రీజనల్ డెవలప్‌మెంట్ సంస్థ (డీఎంఆర్డీఏ) చైర్మన్‌గా నియమితులైన ఎంపీ ప్రణవ్‌గోపాల్ తన తల్లి సుమతితో కలిసి బుధవారం సచివాలయంలో ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్‌ను కలిసి పుస్తకాలను బహూకరించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్న తనకు ఉన్నత పదవిని కట్టబెట్టినందుకు, విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని పుస్తకాలను బహూకరించినట్టు ప్రణవ్ తెలిపారు. అంతేకాకుండా తన వద్దకు అభినందనలు తెలియజేయడానికి వస్తున్న వారికి పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని కోరానని, వాటిని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్నానని మంత్రికి వివరించారు. విశాఖ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి ప్రణవ్‌గోపాల్‌కు సూచించారు.

ప్రేక్షకులను ఓలలాడిస్తున్న గాయకులు

సమాజ సేవలో వైజాగ్ బీట్స్

- వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా విశాఖ వేదికగా కార్యక్రమాలు
- పాటల కచేరీ ఆదాయంతో సమాజ సేవ

వారంతా గాయకులు...ఎక్కడెక్కడో స్థిరపడి సామాజిక మాధ్యమాలతో పరిచయాలు పెంచుకున్న ఔత్సాహికులు. తమ గాన మాధుర్యంతో ప్రేక్షకులను ఓలలాడించడమే కాదు..సమాజ సేవలో భాగస్థులు అవుతున్నారు. ఇందుకోసం తమకు తెలిసిన విద్యనే పెట్టుబడిగా పెడుతున్నారు. ఏడాదికి ఒకసారి పాటల కచేరీ నిర్వహించి, దాని ద్వారా ఆర్జించిన మొత్తాన్ని ఖర్చు చేస్తున్నారు. వైజాగ్ బీట్స్ పేరుతో కళాబృందంగా ఏర్పడి, సేవలో లీనమవుతున్నారు. ఐదేళ్లుగా సాగుతున్న ఈ మహాక్రతువు మరెందరికో ఆదర్శంగా నిలుస్తోంది.


విశాఖలో కలుసుకున్న వివిధ ప్రాంతాల గాయకులు (ఫైల్ ఫొటో)



కలిసికట్టుగా పాటలు పాడుతున్న గాయకులు

(భీమునిపట్నం రూరల్, ఆంధ్రజ్యోతి)

గతంలో గాయకులంతా కలిసికట్టుగా పాడాలంటే ఓ చోట కలుసుకోవాల్సిన పరిస్థితి. కానీ సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తరువాత ఇలాంటి పాటలు పాడేందుకు వివిధ యాప్‌ల ద్వారా అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయకుల్లో కొంతమంది ఓ సంఘంగా ఏర్పడి వివిధ కార్యకలాపాలను చేపట్టాలని యోచించారు. వృత్తి, ఉపాధి, ఉద్యోగాలను నిర్వహిస్తూనే సమాజసేవలో తమ వంతు పాత్ర పోషించాలని భావించారు. దీంతో 'వైజాగ్ బీట్స్' పేరుతో ఉపాధ్యాయులు, న్యాయవాదులు, లెక్చరర్లు, ఇతర వృత్తులలో స్థిరపడిన గాయకులు ఓ సంస్థను ఏర్పాటుచేశారు. దీనికి డాక్టర్ కె.శారద అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పడినప్పటికీ, వివిధ ప్రాంతాలలో వీరు సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.


నిరుపేద కళాకారులకు రూ.50 వేల చెక్కును అందిస్తున్న వైజాగ్ బీట్స్ ప్రతినిధులు (ఫైల్ ఫొటో)

ఐదేళ్లుగా కార్యకలాపాలు

మొట్టమొదటిసారిగా వీరు 2019 అక్టోబరు 20న కలుసుకుని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పాట ద్వారా సమాజానికి మేలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సమావేశానికి 40 మంది హాజరయ్యారు. సినీ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేశ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఆ తర్వాత 2021 ఏప్రిల్ 11న నగరంలోకి ద్వారకా ఇన్ హోటల్‌లో పాటల కార్యక్రమాన్ని చేపట్టారు. ఆ సమయంలో కరోనా కారణంగా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని విభావరిని నిర్వహించారు. ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంనకు కార్యక్రమాన్ని అంకితం చేశారు. అనంతరం 2022 జనవరి 2న సవే రా ఫంక్షన్ హాలులో 55 మంది గాయకులతో సంగీత విభావరి నిర్వహించి వచ్చిన ప్రవేశ రుసుం సుమారు రూ.35 వేలను అంధ విద్యార్థులకు విరాళంగా అందించారు. అదే ఏడాది సెప్టెంబరు 11న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 60 మంది గాయకులతో నిర్వహించిన కార్యక్రమానికి సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వచ్చిన మొత్తం రూ.25 వేలు సన్‌ఫ్లవర్ పాఠశాలకు అందించారు. ఈ ఏడాది ఏప్రిల్ 28న పోతినమల్లయ్యపాలెం వైజాగ్ కన్వెన్షన్ హాలులో 70 మంది గాయకులతో సినీ సంగీత దర్శకుడు గంటాడి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కచేరికి ప్రేక్షకుల ఆదరాభిమానాలు లభించాయి. దీంతో లభించిన రూ.50 వేలను నిరుపేద కళాకారులకు విరాళంగా ఇచ్చారు. రానున్నకాలంలో మరిన్ని కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సంగీత విభావరులు ఏర్పాటు చేయలేని సమయంలో గాయకులు కలిసికట్టుగా పాడిన పాటలకు యూట్యూబ్ ద్వారా ప్రచారం కల్పిస్తున్నామని నిర్వాహకురాలు శారద తెలిపారు.

దొన్నుదొరకు సాదర స్వాగతం


దొన్నుదొరకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్‌గా నియమితులైన సివేరి దొన్నుదొర బుధవారం విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు, ఆర్టీసీ కార్మికులు, వివిధ మండలాల అధ్యక్షులు, పంచాయతీల సర్పంచ్‌లు, టీడీపీ నేతలు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

అప్పన్న సన్నిధిలో సందడిగా చిలుకు ద్వాదశి


చెరకు, రోకళ్లతో దంచుతున్న అర్చకులు

సింహాచలం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో బుధవారం సాయంత్రం చిలుకు ద్వాదశి ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్తీకమాస శుక్లపక్ష ద్వాదశి రోజున అప్పన్న ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సాయంత్రం 4.30 గంటలకు స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించిన ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులు, శయన పెరుమాళ్, ఆళ్వార్లతోపాటు ఆస్థానమండపంలో ప్రత్యేక సింహాసనంపై అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తొలుత షోడశోపచారాలను సమర్పించి, నృసింహ అష్టోత్తర శతనామావళితో పూజలు చేశారు. సంప్రదాయబద్ధమైన రోలు, రోకళ్లకు పూజలు చేసిన తర్వాత రోలులో నవ్వుల పప్పు, బెల్లం, పాలు వేసి తొలుత చెరకు గడలు, అనంతరం రోకళ్లతో దంచారు. ఈ మిశ్రమాన్ని స్వామివారికి, ఆలయంలోని ఇతర దేవతామూర్తులకు నైవేద్యంగా సమర్పించి, మంగళాశాసనం, నీరాజనాలు సమర్పించిన పిమ్మట భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఆచారాన్ని అనుసరించి ఉత్సవంలో అనకాపల్లికి చెందిన ఆడారి కిశోర్‌కుమార్, కుటుంబసభ్యులు సుమారు 110 మంది పాల్గొన్నారు. ఆచారం మేరకు ఉత్సవానికి వినియోగించే నువ్వుల పప్పు, బెల్లం, చెరకు గడలు, పాలను కిశోర్‌కుమార్ దంపతులు స్వామికి సమర్పించారు. ఈవో ఎస్.ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి జీవీఎస్‌కే ప్రసాద్, ప్రజాసంబంధాల అధికారి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు

» కొరియా కాన్సొలేట్ ప్రతినిధులతో ఎంపీ శ్రీభరత్



కొరియా ప్రతినిధులతో ఎంపీ శ్రీభరత్, తదితరులు

మహారాణిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు విస్తృత అవకాశాలున్నాయని, ఆ దిశగా పరిశీలించాలని ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ కోరారు. నోవాటెల్‌లో బుధవారం సీఐఐ ఆధ్వర్యంలో కొరియా కాన్సొలేట్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లీన్ మ్యానుఫ్యాక్చరింగ్, సాంకేతిక, పర్యాటక రంగాలకు నగరంలో అవకాశాలున్నాయని తెలిపారు. రాష్ట్రంలో కియా మోటార్స్ ద్వారా సుమారు 20 వేల మందికి ఉద్యోగ కల్పన లభించిందన్నారు. విశాఖలో ఇలాంటి ప్రాజెక్టులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పారదర్శక విధానాలు ఉన్నందున పెట్టుబడిపెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ఇప్పటికిప్పుడు 200 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, ఇందులో పారిశ్రామిక, సాంస్కృతిక, పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. విశాఖ మెట్రో ప్రాజెక్టులో భాగస్వామ్యానికి కొరియన్ సంస్థలు ఆసక్తి చూపాలని కోరారు. కొరియన్ సంస్కృతితో పర్యాటక సంబంధాలు మెరుగుపడే అవకాశాలు ఉన్నాయని, రెండు దేశాల మధ్య సఖ్యతకు ఇది ఎంతోగానో దోహదపడతాయని ఎంపీ అన్నారు. రిపబ్లిక్ ఆఫ్ కొరియన్ కౌన్సిల్ జనరల్ చాంగ్ న్యూన్ కిమ్, విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు సుదర్శన స్వామి, మల్లికార్జున్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.